


మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపీకి పారిశ్రామిక వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రూ.26 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ, 24 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

గురువారం 12.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 201 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



లోకేష్ కృషితో.. రాష్ట్రానికి మరో భారీ పరిశ్రమ

నాయుడుపేటలో రూ.4 వేల కోట్లతో ఇండో-కొరియా సంయుక్త పరిశ్రమ



- ఏటా 3.6 లక్షల టన్నుల ముడిపదార్థాల తయారీ
- మూడు దశల్లో పరిశ్రమ నిర్మాణం
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ. 4 వేల కోట్ల పెట్టుబడితో భారీ బ్యాటరీ ముడిపదార్థాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. భారత్‌కు చెందిన కార్బన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణ కొరియాకు చెందిన కాస్మో ఏఎం అండ్ టీ కంపెనీలు సంయుక్తంగా ఈ పరిశ్రమను నెలకొల్పనున్నాయి. కార్బన్ కాస్మో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 700 మందికి, పరోక్షంగా మరో 3,500 నుంచి 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో బుధవారం రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో కార్బన్ కాస్మో సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఏర్పాటు, పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్యం, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై చర్చించారు.

230 ఎకరాల్లో మూడు దశల్లో పరిశ్రమ ఏర్పాటు : నాయుడుపేటలో 230 ఎకరాల విస్తీర్ణంలో దక్షిణ కొరియాకు చెందిన కాస్మో సంస్థ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర అవసరాలకు వినియోగించే లిథియం అయాన్ బ్యాటరీల తయారీలో కీలకమైన ఫెరిక్ ఫాస్ఫేట్, లిథియం ఐరన్ ఫాస్ఫేట్, క్యాథోడ్ పదార్థాలను ఇక్కడ ఉత్పత్తి చేయనున్నారు.

మూడు దశల్లో పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో ఏటా 30 వేల టన్నుల ఫెరిక్ ఫాస్ఫేట్, 30 వేల టన్నుల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ ఉత్పత్తి సామర్థ్యంతో 2028 మధ్య నాటికి ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2031 నాటికి మూడో దశను పూర్తి చేసి పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించారు.

మూడు దశలు పూర్తయిన తర్వాత ఏటా 1.8 లక్షల టన్నుల ఫెరిక్ ఫాస్ఫేట్, మరో 1.8 లక్షల టన్నుల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ తయారు చేయనున్నారు. ఇందులో ఏటా 1.3 లక్షల టన్నుల వరకు ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంది. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి అక్టోబర్ 16, 2026న అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అవగాహన ఒప్పందం కుదిరింది. నవంబర్ 6న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.

బ్యాటరీ తయారీ రంగంలో ఏపీకి కీలక పెట్టుబడి : కార్బన్ కాస్మోలో భాగస్వామిగా ఉన్న కోల్‌కతాకు చెందిన కార్బన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటికే విజయనగరం జిల్లా బొబ్బిలిలో కాల్సిన్డ్ పెట్రోలియం కోక్ తయారీ పరిశ్రమను నిర్వహిస్తోంది. మరో భాగస్వామి అయిన దక్షిణ కొరియాకు చెందిన కాస్మో ఏఎం అండ్ టీ బ్యాటరీ క్యాథోడ్ పదార్థాల తయారీలో

మిగతా 2లో...

స్టార్టప్‌లకు గ్లోబల్ ప్రోత్సాహం



- మేధో సంపత్తి హక్కులపై ప్రత్యేక శిక్షణ
- ఏపీ స్టార్టప్‌లకు డబ్ల్యూఐపీఓ సహకారం కోరిన సీఎం
- చేనేత, హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపుపై దృష్టి
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో యువతకు ప్రోత్సాహం

విశాఖపట్నం, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : ఆవిష్కరణలు, పరిశోధన, సృజనాత్మకతకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, రాష్ట్రంలోని స్టార్టప్‌లు-పారిశ్రామికవేత్తలకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్-WIPO డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో సమావేశమయ్యారు. గురువారం నుంచి రెండు రోజుల పాటు సీఐఐ భాగస్వామ్య సదస్సులో జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ చేరుకున్నారు. నోవోటెల్ హోటల్లో వరుస సమావేశాలు నిర్వహించారు. దీంట్లో భాగంగా సీఎం చంద్రబాబు WIPO డీజీతో భేటీ అ-య్యారు. WIPO-ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఏర్పాటు, భాగస్వామ్య కార్యక్రమం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, సూక్ష్మ-చిన్న-మధ్యతరహా పరిశ్రమలకు మేధో సంపత్తి హక్కులు పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్లు, సాంకేతిక పరిజ్ఞాన పరిరక్షణపై శిక్షణ అందించే అవకాశాలను చర్చించారు.

మిగతా 2లో...

యూఏఈతో ఏపీ దోస్తీ

- మారిటైమ్ రంగంలోనూ యూఏఈతో కలిసి పనిచేసేందుకు సిద్ధం
- యూఏఈ మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ

సింగపూర్‌తో అభివృద్ధి బంధం

- మోడల్ టౌన్‌షిప్ ఏర్పాటుపై సీఎం దిశానిర్దేశం
- ప్రాజెక్టుల అమలుకు స్పష్టమైన మైలురాళ్లు
- 2027, 2028 మార్చి వరకు కార్యాచరణ ప్రణాళికలు

ఏపీ పారిశ్రామిక ప్రగతికి ప్రపంచ నీరాజనం


- రాష్ట్ర పారిశ్రామిక విధానాలపై విదేశీ ప్రతినిధుల ప్రశంసలు
- క్వాంటం టెక్నాలజీలో ముందడుగుకు ప్రత్యేక గుర్తింపు
- ఏవియేషన్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- రేర్ ఎర్త్ మినరల్స్‌లో అవకాశాలపై సీఎం వివరణ

జలవనరుల అభివృద్ధికి కార్యాచరణ

- లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై ప్రత్యేక దృష్టి
- మరమ్మతులకు రూ.632.07 కోట్లు
- సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత రానివ్వను

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

- ఈ నెల 13న అల్పపీడనం !
- 14 నాటికి మరింత బలపడే అవకాశం..
- 15న వాయుగుండంగా మారే సూచనలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని వాతావరణ శాఖ హెచ్చరిక



2లో

విద్యా సామర్థ్యాలకు పదును

- ఉత్తమ ఉపాధ్యాయులకు విదేశాల్లో శిక్షణ
- రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక బోధనా పద్ధతుల విస్తరణ
- అధికారులకు నాయకత్వ, డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ
- సింగపూర్‌తో సహకారం విస్తరణకు మంత్రి లోకేష్ ప్రతిపాదన



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : సింగపూర్ ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర విద్యాశాఖలో అమలు చేస్తున్న సామర్థ్యాల పెంపు కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, ఈ సహకారాన్ని మరిన్ని రంగాలకు విస్తరించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు.

ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతుల్లో శిక్షణతో పాటు ప్రభుత్వ అధికారులకు నాయకత్వ నైపుణ్యాలు, డిజిటల్ గవర్నెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.

మిగతా 3లో...

స్వచ్ఛతలో మన నగరాల సత్తా



- విజయవాడకు జాతీయ స్థాయిలో మూడో స్థానం
- విశాఖకు ప్రథమ స్థానం.. గుంటూరుకు మూడో ర్యాంకు
- నవీ ముంబై టాప్.. రెండో స్థానంలో సూరత్
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి మూడు గుర్తింపులు

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 జాతీయ స్థాయి పరిశుభ్రత పోటీలో ఆంధ్రప్రదేశ్ నగరాలు సత్తా చాటాయి. దేశంలోని స్వచ్ఛ నగరాల సూపర్ స్వచ్ఛ్ లీగ్ విభాగంలో విజయవాడ మూడో స్థానాన్నికైవసం చేసుకుంది.

మిగతా 2లో...

పెట్టుబడుల వేటకు విశాఖ వేదిక



- నేటి నుంచి రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు
- చంద్రబాబు, అమిత్‌షా, పీయూష్ గోయల్ హాజరు
- 400కు పైగా వ్యాపార సమావేశాలకు ఏర్పాట్లు
- ఆరు కీలక రంగాలపై ప్రపంచస్థాయి చర్చలు

విశాఖపట్నం, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : అంతర్జాతీయ పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా నిలబెట్టే లక్ష్యంతో నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖపట్నం ముస్తాబైంది.

మిగతా 3లో...

రైతులు, చిన్న సంస్థలకు కేంద్రం భరోసా



- రైతులకు ప్రాధాన్యమిస్తున్న మోదీ ప్రభుత్వం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ హర్షం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రైతుల ప్రయోజనాలు, చిన్న వ్యాపార సంస్థల అభివృద్ధి, భారతదేశ చారిత్రక వారసత్వ పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు.

రబీ సీజన్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా సబ్సిడీ కోసం రూ. 62,370 కోట్లు కేటాయించడం, చిన్న సంస్థలకు రుణ సదుపాయాల కోసం రూ. 5,000 కోట్లు కేటాయించడం ద్వారా వ్యవసాయ రంగానికి, చిన్న వ్యాపార సంస్థలకు ఆర్థిక సహకారం అందించే దిశగా నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

నూతన ఢిల్లీ చారిత్రక నార్త్, సౌత్ బ్లాక్ భవనాలను ఆధునిక సాంకేతికతతో ప్రపంచస్థాయి మ్యూజియంగా అభివృద్ధి చేయడం భారతీయ చరిత్ర, సంస్కృతి, నాగరికతా వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు పరిచయం చేసే కార్యక్రమంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మిగతా 2లో...

లోకేష్ కృషితో.. రాష్ట్రానికి మరో భారీ పరిశ్రమ



(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సంస్థ. శామ్‌సంగ్ ఎస్‌డీఐ, ఎల్‌జీ ఎనర్జీ సొల్యూషన్ వంటి ప్రముఖ బ్యాటరీ తయారీ కంపెనీలకు ఈ సంస్థ ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.

ఈ రెండు సంస్థల భాగస్వామ్యంతో నాయుడుపేటలో ఏర్పాటు కానున్న పరిశ్రమ దేశీయంగా బ్యాటరీల తయారీకి అవసరమైన కీలక ముడిపదార్థాల లభ్యతను పెంచడంతో పాటు విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దోహదపడనుంది.

ఐఐటీ తిరుపతితో కలిసి పరిశోధనలు చేపట్టాలి : ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ బ్యాటరీల తయారీతో పాటు పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బ్యాటరీ క్యాథోడ్ పదార్థాల నాణ్యత పరీక్షలు, వినియోగించిన బ్యాటరీల నుంచి విలువైన పదార్థాలను తిరిగి సేకరించే రీసైక్లింగ్ సాంకేతికతపై పరిశోధనల కోసం ఐఐటీ తిరుపతితో కలిసి ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కాస్మో సంస్థ ప్రతినిధులను కోరారు.

ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీకి ఏపీని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి లోకేష్

"కార్బన్ కాస్మో సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉంది. భారత్--దక్షిణ కొరియా భాగస్వామ్యంతో ప్రపంచస్థాయి బ్యాటరీ క్యాథోడ్ తయారీ సాంకేతికత నాయుడుపేటకు రానుంది. దేశంలో బ్యాటరీల తయారీకి అవసరమైన కీలక ముడిపదార్థాల సరఫరాలో ఉన్న లోటును భర్తీ చేసేందుకు ఈ పరిశ్రమ దోహదపడుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం. ఈ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో కార్బన్ రిసోర్సెస్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అభినవ్ కుమార్ జలాన్, కాస్మో ఏఎం అండ్ టీ వైస్ ప్రెసిడెంట్ డ్యూక్ క్యూ పార్క్, జనరల్ మేనేజర్ బ్యోంగ్‌డే కిమ్, అమన్ కపూర్, సియుంగ్ జోంగ్ లీ తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు గ్లోబల్ ప్రోత్సాహం



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని చేనేత, హస్తకళలు, స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (GI Tag) సాధించడం, ఇప్పటికే గుర్తింపు పొందిన ఉత్పత్తుల మార్కెట్ విస్తరణ, వాటి నాణ్యత-బ్రాండింగ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే అంశాలపై ఔ్రూ సహకారాన్ని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు సహకరిస్తున్నామని తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చేలా... రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని WIPO ప్రతినిధులను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.

స్టార్టప్ ఎకోసిస్టమ్ బలోపేతమే లక్ష్యం : WIPO డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో భేటీ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పాలసీల గురించి చర్చించారు. ముఖ్యంగా స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న విధానాలను వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం సదస్సులు అద్భుతంగా నిర్వహిస్తున్నారని డారెన్ టాంగ్ చంద్రబాబుతో అన్నారు. అనేక రంగాల్లో ప్రముఖులను, ప్రముఖ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం మంచి పరిణామమని... దీని వల్ల వివిధ రంగాలకు సంబంధించిన అంశాలపై అందరికీ అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు. తాము ఇప్పటికే ఏపీలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి విన్నామని... క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహించడంలో ఏపీ ముందు వరుసలో ఉందని... అమరావతి క్వాంటం గురించి కూడా తమకు అవగాహన ఉందని డారెన్ టాంగ్ ముఖ్యమంత్రి దగ్గర ప్రస్తావించారు. ఏపీని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టినట్టు సీఎం చంద్రబాబు డారెన్ టాంగ్‌కు వివరించారు. క్వాంటం, ఏఐ వంటి టెక్నాలజీలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతను సిద్ధం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రైవేటు రంగంతో పాటు.. పాలనలో కూడా టెక్నాలజీని వినియోగించడం ద్వారా ప్రగతి సాధించడంతోపాటు... ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభతరంగా అందించేలా చేస్తున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ, స్పేస్ టెక్నాలజీ, క్వాంటం, నాచురల్ ఫార్మింగ్ సహా అనేక రంగాల్లో ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని సీఎం తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని... 10 లక్షల మంది మహిళలను వ్యాపార వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. స్థానికంగా మహిళలు తీర్చిదిద్దే ఉత్పత్తులకు స్వయం ఏపీ పేరుతో బ్రాండింగ్ చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మహిళా సాధికారత కోసం తాము అమలు చేసే విధానాల్లో ఔ్రూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఔ్రూ ప్రతినిధుల, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులు, చిన్న సంస్థలకు కేంద్రం భరోసా



(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టుకు రూ.3,230 కోట్ల వ్యయాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు తెలిపారు.

భారతదేశ అభివృద్ధిలో రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ నిర్ణయాలు ప్రతిబింబిస్తున్నాయని ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు.

ఎటూ తేలకుండానే ముగిసిన శాంతి చర్చలు

అబుదాబీ : రష్యా, ఉక్రెయిన్, అమెరికా నేతలు, అధికారుల మధ్య అబుదాబీలో రెండు రోజుల పాటు జరిగిన శాంతి చర్చలు బుధవారం ముగిశాయి. తొమ్మిది నెలల విరామం తర్వాత జరిగిన త్రైపాక్షిక చర్చలు ముగిసినప్పటికీ ఉక్రెయిన్ ప్రతినిధి బృందం అబుదాబీలోనే ఉండి యూరోపియన్ భాగస్వాములు, అమెరికా దౌత్యవేత్తలతో విడిగా సమావేశం అవుతోంది. త్రైపాక్షిక సమావేశంలో శాంతి ఒప్పందానికి సంబంధించి ఎలాంటి పురోగతి కన్పించనప్పటికీ దౌత్యపరమైన ముందడుగు పడడం సానుకూల పరిణామంగా అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. భూభాగాల నియంత్రణ, భద్రతా సంబంధమైన హామీలపై రష్యా, ఉక్రెయిన్ మధ్య తీవ్రమైన విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఏపీ పారిశ్రామిక ప్రగతికి ప్రపంచ నీరాజనం



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల ఆకర్షణకు చేపడుతున్న కార్యక్రమాలపై విదేశీ ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అంతర్జాతీయ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యుఐపీఓ) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సదస్సు అద్భుతంగా ఉందని ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కూడా డారెన్ టాంగ్ ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ రంగంలో రాష్ట్రం ముందుచూపుతో వ్యవహరిస్తోందని, క్వాంటం టెక్నాలజీ ప్రాజెక్టు గురించి వివరంగా తెలుసుకున్నానని తెలిపారు. పరిశ్రమలు, సాంకేతిక రంగాలు, మేధో సంపత్తి వంటి విభిన్న అంశాలపై అంతర్జాతీయ స్థాయి చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో జపాన్ సంస్థల విస్తరణకు సంబంధించిన ప్రణాళికలను అమలు చేస్తామని జపాన్ రాయబారి కెయిచీ ఓనో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు తమ దేశ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రి విమానాశ్రయ నిర్మాణం, సౌకర్యాలను ప్రశంసించారు. తొలిసారిగా ఈ విమానాశ్రయానికి వచ్చానని, కొత్త విమానాశ్రయం ఎంతో ఆకర్షణీయంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కీలక పాత్ర పోషించనుందని వివరించారు.

విమానాశ్రయానికి అనుబంధంగా ఏవియేషన్ రంగంలో పలు ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. వీటి ద్వారా ఉత్తరాంధ్రలో కొత్త పారిశ్రామిక, వాణిజ్య, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన రంగాలు, అందుబాటులో ఉన్న వనరులను ముఖ్యమంత్రి విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలకు వివరించారు. ముఖ్యంగా రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అవకాశాలను ప్రస్తావించారు. సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, న్యూక్లియర్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ సంస్థలకు ఆహ్వానం పలికారు.

అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి వివరించారు. విదేశీ ప్రతినిధుల ప్రశంసలు, పెట్టుబడులపై వారి ఆసక్తి రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి సానుకూల సంకేతాలుగా భావిస్తున్నారు.

యూఏఈతో ఏపీ దోస్తీ




విశాఖపట్నం, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని దుబాయ్-యూఏఈలకు చెందిన వివిధ ప్రముఖ కంపెనీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. సీఐఐ సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. రాయలసీమకు చెందిన ఫలాలు ఇప్పటికే విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని సీఎం చంద్రబాబు తౌక్ అల్ మర్రీ దృష్టికి తెచ్చారు. రూ.1 లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. యూఏఈ ఏర్పాటు చేయనున్న ఫుడ్ క్లస్టర్‌లో ఆ దేశానికి చెందిన అగ్రిఫుడ్ కంపెనీ సిలాల్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్రంలోని ఏపీ, వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, ఎగుమతుల రంగాల్లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. చిత్తూరు జిల్లాలో దుబాయికి చెందిన ఫ్లోర్‌మాస్టర్ పరిశ్రమ గ్రౌండింగ్ విషయం కూడా ఇరువురి మధ్య ప్రస్తావనకు వచ్చింది. ఫుడ్ క్లస్టర్‌లో త్వరితగతిన నిర్ణయం తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు యూఏఈ మంత్రి తౌక్ మర్రిని కోరారు. అలాగే మారిటైమ్, ఏరో స్పేస్, డిఫెన్స్ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూఏఈతో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.

భోగాపురం విమానాశ్రయం అద్భుతంగా ఉంది: యూఏఈ మంత్రి : ఏపీలో నూతనంగా నిర్మించిన భోగాపురం విమానాశ్రయం అద్భుతంగా ఉందని యుఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ అల్ తౌక్ మర్రి ముఖ్యమంత్రితో అన్నారు. సుందరమైన విమానాశ్రయాన్ని ఏపీలో నిర్మించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. భారత తూర్పు తీరంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఆసక్తిగా ఉందని.. తమ దేశ పెట్టుబడులకు ఏపీ కీలక ప్రాంతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీకి బ్లూచిప్ కంపెనీలు, గూగుల్ లాంటి డేటా సెంటర్లు రావటం శుభపరిణామం అని అన్నారు. పెట్టుబడులను రాబట్టే విషయంలో ఏపీకి ఉన్న సామర్థ్యం ఏమిటో తెలుస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రొయ్యలతో పాటు ఇతర ఆక్వా ఉత్పత్తుల దిగుమతులపై ఆలోచన చేస్తున్నట్టు యూఏఈ ప్రతినిధి బృందం తెలిపింది.

ఏపీలో పెట్టనున్న ఫుడ్ క్లస్టర్ లో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన మరో 12 కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని సీఎంకు వివరించారు. ఈ భేటీలో యూఏఈకి చెందిన అధికారులు, కంపెనీల ప్రతినిధులు, ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

జలవనరుల అభివృద్ధికి కార్యాచరణ



అమరావతి, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రంలో నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి జూన్ నాటికి వాటి ద్వారా నీరు విడుదల చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఖరీఫ్‌కు పునరుద్ధరణ పరిధిలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల మరమ్మతులన్నీ ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాటి స్థితిగతులను పరిశీలించి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, నిర్వహణ, ఇరిగేషన్ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు.

జలహారతి కార్పొరేషన్ ద్వారా నిరంతర పర్యవేక్షణ : రాష్ట్రంలో 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటి పునరుద్ధరణ ద్వారా 7.49 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీటి సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఇక ఎత్తిపోతల పథకాల నిర్వహణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ బాధ్యతను జలహారతి కార్పొరేషన్ ద్వారా చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదంటే సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. మరమ్మతుల కోసం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన పూర్తి చేసిన వెంటనే టెండర్లు పిలవాలని, ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని సీఎం సూచించారు. వచ్చే జూన్ నాటికి అన్ని ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు.

ఇరిగేషన్ భూముల్లో 903.1మెగావాట్ల సౌర విద్యుత్ : జలవనరుల శాఖ పరిధిలో అందుబాటులో ఉన్న 5,565 ఎకరాల భూమిలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 4,061 ఎకరాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా 877.3 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో 84 ప్రాంతాలను గుర్తించగా, వాటిలో 110 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. దీని ద్వారా 25.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా 4,171 ఎకరాల భూమిని సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అధికారులు వివరించారు. కేవలం భూములకే పరిమితం కాకుండా కాలువలపై కూడా సౌర విద్యుత్, జలవిద్యుత్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందించడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా ఆదాయం పొందే విధానాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. రవాణా, విద్యుత్ ఉత్పత్తి, సౌర విద్యుత్, వ్యవసాయ రంగాలను అనుసంధానం చేయడం ద్వారా సంపద సృష్టికి అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం : ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ తరహాలోనే జలవనరుల రంగంలోనూ వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల్లో ఉన్న విధంగానే సాగునీటి రంగంలోనూ నియంత్రణ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గంగా-కావేరి అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా రవాణా, విద్యుత్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావచ్చని, ఆయా రంగాలకు నీటి వినియోగంపై రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు.

నిధులకు కొరత రానివ్వను... ప్రాజెక్టులు పూర్తవ్వాలి : ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మంగా తీసుకున్న 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసిన సీఎం... నిర్దేశించుకున్న గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే రెండున్నరేళ్లలో ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.


సింగపూర్‌తో అభివృద్ధి బంధం



అమరావతి, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్-సింగపూర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అమలులో భాగంగా నిర్వహించిన మూడో జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సింగపూర్ ప్రభుత్వ మంత్రి గన్ సియో హువాంగ్ నేతృత్వంలోని 14 మంది సభ్యుల ప్రతినిధి బృందంతో బుధవారం అమరావతి క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ మంత్రి రాష్ట్రంలో భాగస్వామ్య కార్యక్రమాల పురోగతిని, ముఖ్యమంత్రి ముందుచూపును ప్రశంసించారు. మరోవైపు 2027 మార్చి నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సింగపూర్ బృందానికి ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్లు, అంతరిక్షం, డ్రోన్ల రంగాల్లో కొత్త హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల సంభవించిన తుపాను సమయంలో నాలుగు రోజుల్లోనే 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించినట్లు వివరించారు.

సామర్థ్య పెంపు, నైపుణ్యాభివృద్ధి పై చర్చ : సింగపూర్‌లో మంత్రుల బృందం నిర్వహించిన కార్యక్రమం ఫలవంతంగా సాగిందని సింగపూర్ ప్రతినిధులు తెలిపారు. సివిల్ సర్వీసెస్ సంస్కరణలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారని, ఏడుగురు జిల్లా కలెక్టర్లు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అమలుకు ఇరు పక్షాలు సమన్వయంతో, పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించి పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. స్పష్టమైన మైలురాళ్లను నిర్దేశించుకుని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి పురోగతిని సమీక్షించాలని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా 2027 మార్చి వరకు ఒక ప్రణాళిక, 2028 మార్చి వరకు మరో ప్రణాళికను ప్రాధాన్యతా క్రమంలో సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్--సింగపూర్ భాగస్వామ్యం ద్వారా ప్రపంచస్థాయి ఉత్తమ విధానాలు రాష్ట్ర ప్రజలకు చేరువవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



అమరావతి, నవంబర్ 11: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 24 గంటల్లో మరింత బలపడి సుస్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశముందని అంచనా వేసింది. నవంబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే సూచనలు ఉన్నాయని వాతావరణ విశ్లేషణలు చెబుతున్నాయి.

అల్పపీడనం ప్రభావంతో నవంబర్ 14, 15తేదీల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో సముద్రం అలజడిగా మారే అవకాశం ఉంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, అప్పుడప్పుడు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆయా సముద్ర ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించింది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడనం ప్రభావం ఎలా ఉండబోతోందన్న దానిపై స్పష్టత లేదు. అయితే వ్యవస్థ బలపడే తీరు, వాయువ్య దిశగా దాని ప్రయాణాన్ని బట్టి దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు తీర ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలను వాతావరణ నిపుణులు పరిశీలిస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ప్రస్తుతం కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో రాబోయే మూడు రోజులు ప్రధానంగా పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నవంబర్ 14న రాయలసీమలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

స్వచ్ఛతలో మన నగరాల సత్తా

(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్రలోని నవీ ముంబై మొదటి స్థానంలో నిలవగా, గుజరాత్‌లోని సూరత్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు అవార్డులు అందజేశారు.

ఈసారి స్వచ్ఛత పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరో రెండు నగరాలు కూడా ప్రత్యేక గుర్తింపు పొందాయి. పది లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా మొదటి స్థానాన్ని సాధించింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మూడో స్థానంలో నిలిచాయి. మూడు నుంచి పది లక్షల జనాభా కలిగిన నగరాల విభాగంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని అగ్రస్థానంలో నిలవగా, చండీగఢ్ రెండో స్థానాన్ని, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మూడో స్థానాన్ని సాధించాయి. ఇప్పటివరకు వరుసగా ఎనిమిదేళ్లపాటు దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలిచిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఈసారి అగ్రస్థానాల్లో చోటు దక్కించుకోలేకపోవడం విశేషం. స్వచ్ఛత పోటీల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది సర్వేక్షణ్‌లో పట్టణాల పరిశుభ్రతను పలు కీలక అంశాల ఆధారంగా అంచనా వేశారు. చెత్త సేకరణ, వేరు చేయడం, రవాణా, ఘన వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల పరిశుభ్రత, పారిశుద్ధ్య సదుపాయాలు, మురుగునీటి నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ప్రజల అభిప్రాయాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను పరిశీలించారు. దేశవ్యాప్తంగా మూడు వేల మందికి పైగా శిక్షణ పొందిన పరిశీలకులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణతో పాటు డిజిటల్ విధానంలో వివరాలను ధ్రువీకరించారు. ఇతర విభాగాల్లోనూ పలు నగరాలు అవార్డులు సాధించాయి. నదీ తీర పట్టణాల విభాగంలో మధ్యప్రదేశ్‌లోని రేవా మొదటి స్థానంలో నిలవగా, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి తర్వాతి స్థానాల్లో నిలిచాయి. తీర ప్రాంత పట్టణాల విభాగంలో ఒడిశాలోని పూరీ అగ్రస్థానాన్ని సాధించింది. కేరళలోని అలప్పుజ, మహారాష్ట్రలోని రత్నగిరి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. హిమాలయ ప్రాంత పరిశుభ్ర నగరాల విభాగంలో ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. దేశవ్యాప్తంగా పట్టణాల పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పదో విడతలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు సాధించిన గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. అయితే ఈ స్థానాలను నిలబెట్టుకోవడంతోపాటు పట్టణాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడం స్థానిక సంస్థలకు కీలక బాధ్యతగా మారింది.

జమ్ముకాశ్మీర్‌లో ఉగ్ర కలకలం



శ్రీనగర్(జర్నలిస్ట్ ఫైల్) : జమ్ముకాశ్మీర్‌లో మరోమారు ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఏకంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) శిబిరం లక్ష్యంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో ముగ్గురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..కుల్గాం జిల్లాలోని ఒక చెక్ పాయింట్ వద్ద ఉన్న సిఆర్‌పిఎఫ్ శిబిరంపై బుధవారం మధ్యాహ్నం సుమారు 2:15 గంటల ప్రాంతంలో మోటార్ సైకిల్ పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఈ నేపథ్యంలో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపగా..దుండగులు వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడగా..వారిని అనంతనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు జవాన్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఉగ్రదాడి నేపథ్యంలో ఆ ప్రాంతంతో భారీ బలగాలను మోహరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గాయపడిన వారు 46వ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌కు చెందిన సిబ్బందిగా తెలుస్తోంది.

సోనియా, రాహుల్‌తో షర్మిల భేటీ



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ కుమార్తె అంజలి రెడ్డి వివాహ వేడుకకు హాజరుకావాలని ఆహ్వానించారు. బుధవారం నాడిక్కడ తన భర్త అనిల్‌కుమార్‌తో కలిసి సోనియా గాంధీని కలిసిన షర్మిల, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ తాను స్వయంగా రచించిన 'బిలాంగింగ్' ఆత్మకథ పుస్తకాన్ని షర్మిలకు బహుమతిగా అందజేశారు. 'శర్మి' అంటూ ఆప్యాయంగా సంబోధించి పుస్తకాన్ని అందించడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని షర్మిల తెలిపారు. సోనియా గాంధీ చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని అందుకున్న తొలి వ్యక్తిగా గర్వంగా ఉందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీతో చర్చించినట్లు షర్మిల వెల్లడించారు. తన కుమార్తె అంజలి రెడ్డి వివాహ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కూడా ఆహ్వానిస్తానని షర్మిల తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వివాహ వేడుకకు వివిధ పార్టీల నాయకులను ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు.

మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు తీవ్ర అస్వస్థత..



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ మాజీ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ (75) తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే చికిత్స పొందుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బుధవారం ఉదయం వ్యాహ్యాళికి వెళ్లిన ఆయన నడుస్తూ ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయారు. కొద్ది నిమిషాల పాటు అపస్మారక స్థితిలో ఉండటంతో భద్రతా సిబ్బంది వెంటనే ఆయనను ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హుటాహుటిన అంబులెన్స్‌లో ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన కార్డియో న్యూరో కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. తొలుత ఆయనకు ఢిల్లీలోని ప్రముఖ వైద్య పరిశోధన సంస్థ అయిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియారీ సైన్సెస్ (ఐఎల్‌బిఎస్) నుంచి ప్రత్యేక బృందం, అలాగే ప్రముఖ వైద్యులు సందీప్ సేత్ నేతృత్వంలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం డాక్టర్ సేత్ సూచన మేరకు ఎయిమ్స్‌కు తరలించారు. అయితే ఈ విషయంపై ఎయిమ్స్ వైద్యులు అధికారిక ప్రకటన ఏదీ విడుదల చేయలేదు. 2022 ఆగస్టు నుంచి 14వ ఉపరాష్ట్రపతిగా కొనసాగిన ధన్‌ఖడ్ గతేడాది జులై 21న అనూహ్య పరిణామాల నేపథ్యంలో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఉపరాష్ట్రపతి భవన్ ఖాళీ చేసిన తర్వాత ఆయనకు అధికారిక నివాసమేదీ కేటాయించలేదు. దీంతో ఆయన సౌత్ ఢిల్లీలోని హర్యానా రాజకీయ నేత అభయ్ చౌతాలా ఫామ్‌హౌస్‌లో నివాసముంటున్నారు.

న్యాయాధికారుల ఉద్యోగకాలం పెంపు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో న్యాయాధికారుల ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 61 సంవత్సరాలుగా ఉన్న వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచారు. ఈ సవరణ 2026 మార్చి 31వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఆర్థికశాఖ తన ఉత్తర్వుల్లో బుధవారం ప్రకటించింది. 1984 నాటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపరన్యుయేషన్) చట్టంలోని సెక్షన్ (3ఏ)లో ఉన్న 61 సంవత్సరాల వయోపరిమితిని 62 సంవత్సరాలకు మారుస్తున్నట్టు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన న్యాయాధికారులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది.

2026 మార్చి 31వ తేదీన లేదా ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసినవారు, సుప్రీంకోర్టు మధ్యంతర ఉపశమనం కారణంగా కొనసాగినప్పటికీ, లేదా ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసి ఉండే అధికారులు ఈ వయోపరిమితి పెంపునకు అర్హులని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యా సామర్థ్యాలకు పదును



(మొదటి పేజీ తరువాయి)

రాజధాని అమరావతిలోని ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం సింగపూర్-ఆంధ్రప్రదేశ్ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టాండింగ్ కమిటీ మూడో సమావేశం జరిగింది. మంత్రి నారా లోకేష్‌నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వ అధికారుల బృందం సింగపూర్ ప్రతినిధులతో సమావేశమైంది. అమరావతిని ఆధునిక, సమగ్ర, సుస్థిర రాజధాని నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, సింగపూర్ ప్రభుత్వాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలోని అంశాల అమలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గత రెండు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించారు.

సింగపూర్ శిక్షణ ఫలాలు ప్రతి ఉపాధ్యాయుడికీ అందాలి : ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మంత్రులు, 37 మంది ఉపాధ్యాయులకు సింగపూర్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఇందుకు సింగపూర్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని వేసవి సెలవుల్లో సింగపూర్‌కు పంపించి అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతుల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన ఉపాధ్యాయులు తమ అనుభవాన్ని, నేర్చుకున్న ఆధునిక బోధనా పద్ధతులను రాష్ట్రంలోని ఇతర ఉపాధ్యాయులతో పంచుకోవాలన్నారు. ఇందుకోసం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వేదికగా ఉపయోగించుకోవాలని, సింగపూర్ శిక్షణ ఫలాలు రాష్ట్రంలోని ప్రతి ఉపాధ్యాయుడికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

విద్యాశాఖలో సామర్థ్యాల పెంపు కార్యక్రమాలను మార్గదర్శకత్వం, దిశానిర్దేశం , పరిపాలన అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా అమలు చేయాలని మంత్రి పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాలు కేవలం కొద్దిమందికే పరిమితం కాకుండా విద్యావ్యవస్థ మొత్తానికి ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని సూచించారు.

మంత్రులు, కార్యదర్శులకు కలిపి శిక్షణతో మెరుగైన సమన్వయం : సింగపూర్ సహకారంతో అమలు చేస్తున్న SAGE కార్యక్రమం కింద మంత్రులు, శాఖల కార్యదర్శులకు వేర్వేరుగా శిక్షణ ఇవ్వడం కంటే సంబంధిత మంత్రి, అదే శాఖ కార్యదర్శికి ఒకేసారి శిక్షణ ఇవ్వడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని లోకేష్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల విధాన నిర్ణయాలు, వాటి అమలులో సమన్వయం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, సివిల్ సర్వెంట్లకు నాయకత్వ లక్షణాలు, ఆధునిక పరిపాలనా విధానాలు, డిజిటల్ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ, పరస్పర అనుభవాల మార్పిడి కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు.

డిజిటల్ గవర్నెన్స్‌లో సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకుంటాం : డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, రియల్ టైమ్ గవర్నెన్స్, సమీకృత డిజిటల్ వేదికల రూపకల్పన, కమాండ్ కంట్రోల్ సెంటర్ల నిర్వహణ, డేటా ఆధారిత నిర్ణయాల విషయంలో సింగపూర్ సహకారాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు. ఈ రంగాల్లో సహకారం అందించేందుకు సింగపూర్ సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో వరుస తుఫానుల కారణంగా కొన్ని కార్యక్రమాల అమలులో జాప్యం జరిగిందని వివరించారు. ఆ అవరోధాలను అధిగమించి ప్రతిపాదిత కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాల్లో రెండు ప్రభుత్వాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

ఆరు నెలలకోసారి పురోగతిపై సమీక్ష : గత జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో తీసుకున్న కొన్ని నిర్ణయాల అమలులో జాప్యం జరిగిన అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. ఇకపై కమిటీ ప్రతిపాదించిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని ప్రతి ఆరు నెలలకోసారి సమీక్షించాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. పక్కా ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో నిర్దేశిత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమాల అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించినట్లు అధికారులు మంత్రికి వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలపై సింగపూర్ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ పరిపాలన, నాయకత్వ శిక్షణ వంటి రంగాల్లో సహకారానికి సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించారు.

సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు : ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఆర్థిక, ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. జయలక్ష్మి, ఏపీసీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్మెంట్ ఎండీ గణేష్ కుమార్, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, ప్రణాళికా శాఖ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్, అదనపు కమిషనర్లు ఎ. భార్గవ్ తేజ, అభిషేక్ కుమార్, కె. కార్తీక్, ఏడీసీఎల్ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ వి. ఆర్. అలపర్తి, ఆర్థిక శాఖ అదనపు డైరెక్టర్ దత్తి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ ప్రతినిధి బృందానికి గన్ సియో హువాంగ్ నేతృత్వం వహించారు. ఈ బృందంలో సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్య, పరిశ్రమల శాఖలకు చెందిన ప్రతినిధులతో పాటు డాక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్ (సీనియర్ డైరెక్టర్, దక్షిణాసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా విభాగం), ఫెయిన్ యీ (డైరెక్టర్--ఇండియా), ఎలిజా అంగ్ (సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్-ఇండియా), జోసెఫ్ మంటో (అసిస్టెంట్ డైరెక్టర్-ఇండియా), సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టాయ్ లియన్ చియు, లిమ్ చీ కియా (డిప్యూటీ డైరెక్టర్), ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హో చీ హిన్, రీజినల్ డైరెక్టర్ జెసీ ఎన్జీ, చెన్నైలోని సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్, న్యూఢిల్లీలోని సింగపూర్ డిప్యూటీ హై కమిషనర్ సుమయా బకావి, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ ప్రతినిధి రీమస్ లియు, కాన్సుల్ శామ్యూల్ లోహ్, ఫస్ట్ సెక్రటరీ జోషువా హెచ్‌సీ లిమ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల వేటకు విశాఖ వేదిక

(మొదటి పేజీ తరువాయి)



ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నవంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. 'నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు 58 దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల ప్రతినిధులు హాజరుకానున్నారు. 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు పాల్గొననున్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు సదస్సులో పాల్గొననున్నారు. నవంబర్ 13న భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై ముగింపు కార్యక్రమంలో పాల్గొననున్నారు. సదస్సు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఆరు కీలక అంశాలపై మేధోమథనం : రెండు రోజుల సదస్సులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు, పెట్టుబడుల అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ పరిశ్రమలపై నిపుణులు చర్చించనున్నారు. ప్రధానంగా ఆరు అంశాలను చర్చలకు కేంద్రంగా నిర్ణయించారు. వాణిజ్యం, పెట్టుబడులు, గ్లోబల్ వాల్యూ చైన్స్; విశ్వాసం, జియో ఎకనామిక్స్, అంతర్జాతీయ సహకారం; వ్యవసాయం, ఆహార భద్రత, జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ; ప్రతిభ, నైపుణ్యాలు, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు; సాంకేతికత, ఆవిష్కరణలు, భవిష్యత్ పరిశ్రమలు; స్వచ్ఛ ఇంధనం, సుస్థిర వృద్ధి అంశాలపై ప్రత్యేక చర్చలు జరగనున్నాయి.

ప్రపంచ మార్కెట్లలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి నూతన దిశానిర్దేశం చేయడం, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలను పెంపొందించడం, పెట్టుబడులను ఆకర్షించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం.

400కు పైగా వ్యాపార సమావేశాలు : సదస్సులో భాగంగా 400కు పైగా వ్యాపార సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వాలు, పారిశ్రామిక సంస్థల మధ్య బిజినెస్ టు గవర్నమెంట్ సమావేశాలతో పాటు అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులతో విస్తృత చర్చలు జరగనున్నాయి. బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు, పెట్టుబడి ఒప్పందాలు, భాగస్వామ్యాల ఖరారుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దిగ్గజ కంపెనీల చైర్మన్లు, సీఈఓలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించేందుకు ప్రత్యేక హాల్‌ను సిద్ధం చేశారు.

ప్రధాన సదస్సుకు ముందుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రాంతీయ సన్నాహక పెట్టుబడుల సమావేశాల ద్వారా ఇప్పటికే రూ. 86,522 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ అంతర్జాతీయ సదస్సు ద్వారా మరిన్ని పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యాలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక వేదిక : సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సమాంతరంగా 'ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్--2026' నిర్వహించనున్నారు. మహిళా సాధికారత, పారిశ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, ఆర్థిక వృద్ధిలో వారి పాత్రపై ఇందులో ప్రత్యేకంగా చర్చించనున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, వ్యాపార అవకాశాలు కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేయడంపై దృష్టి సారించనున్నారు.

ఆంధ్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాట్లు : అంతర్జాతీయ అతిథులకు ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు, ఆతిథ్యాన్ని పరిచయం చేసేలా విశాఖ నగరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. గిరిజన థింసా నృత్యం, గరగ నృత్యం, తప్పెటగుళ్లు వంటి జానపద కళారూపాలతో పాటు ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, తోలుబొమ్మలాట, కూచిపూడి కళారూపాలను ప్రదర్శించేలా ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర తీర ప్రాంత ప్రత్యేకతలు, ఆతిథ్య సంప్రదాయాలు, ఆహార రుచులు, అమరావతి వైభవం, నూతన రాజధాని నిర్మాణం, కడియం నర్సరీల విశిష్టతను ప్రతిబింబించే కళాకృతులను ఏర్పాటు చేశారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, అరకు కాఫీ, పర్యాటకం, లాజిస్టిక్స్, సౌర విద్యుత్ రంగాల్లో రాష్ట్రానికి ఉన్న వనరులు, పెట్టుబడి అవకాశాలను వివరించేలా ప్రత్యేక స్టాళ్లు సిద్ధం చేశారు.

పెట్టుబడిదారులతో సీఎం కీలక భేటీలు : సదస్సు ప్రారంభానికి ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖకు చేరుకోనున్నారు. అమరావతిలో సింగపూర్ ప్రతినిధులతో సమావేశమైన అనంతరం విశాఖకు వెళ్లి పలువురు విదేశీ ప్రతినిధులతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, వివిధ రంగాల్లో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం, పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై చర్చించనున్నారు.


ప్రధాన ప్లీనరీ హాల్‌తో పాటు ఒకేసారి రెండు, మూడు కార్యక్రమాలు నిర్వహించుకునేలా పలు సమావేశ మందిరాలను సిద్ధం చేశారు. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు ఆరు కీలక అంశాలపై చర్చలకు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ ప్రతినిధులు, పెట్టుబడిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ సదస్సును విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

పిపిపి పేరుతో పెద్ద స్కామ్



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): పేదలకు ఉచిత వైద్యం అందించే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, ప్రజల సంపదను అనుయాయులకు కట్టబెట్టేందుకు పిపిపి ముసుగులో టిడిపి కూటమి ప్రభుత్వం కుంభకోణానికి పాల్పడుతోందని మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో ప్రకటన చేశారు. వైసిపి ప్రభుత్వంలో 17 కొత్త మెడికల్ కాలేజీలను తీసుకొస్తే, అందులో ఐదు కళాశాలలను ప్రారంభించి మూడింటిని తరగతులకు సిద్ధం చేశామన్నారు. ఏడాదికి రూ.వెయ్యి కోట్లు పెడితే మిగిలిన తొమ్మిది కాలేజీలు కూడా పూర్తవుతాయని, కానీ ఆ పని చేయలేదని తెలిపారు. పూర్తై, వివిధ దశల్లో ఉన్న ఈ కాలేజీలను తెగనమ్ముతున్నారని, వందల కోట్ల విలువైన భూములు ఎకరా రూ.100కే లీజుకు ఇస్తున్నారని విమర్శించారు. వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) పేరుతో ఏకంగా రూ.1,630 కోట్ల ప్రజాధనం దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేటుకు ఇవ్వడంతోపాటు డాక్టర్లు, ప్రొఫెసర్లు, సిబ్బందికి రెండేళ్లపాటు ప్రభుత్వమే జీతాలివ్వడం దోపిడీయేనని విమర్శించారు. దీనికోసం నెలకు రూ.ఐదుకోట్లు చొప్పున రెండేళ్లకు రూ.120 కోట్లు ఒక్కో కాలేజీకి ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. భూములు ప్రభుత్వానివని, భవనాలన్నీ ప్రభుత్వ నిధులతో నిర్మించినవని, విజిఎఫ్ రూపేణా ఇవ్వనున్న డబ్బు కూడా ప్రజాధనమేనని తెలిపారు. ఈ కాలేజీలన్నీ ఆస్పత్రులు, పేదలకు ఉచితంగా నాణ్యమైన మల్టీ స్పెషాల్టీ వైద్యం అందించడంతోపాటు సగం సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ అవుతాయని పేర్కొన్నారు. మిగిలిన సగం సీట్లు కూడా ప్రైవేటువారితో పోలిస్తే అతి తక్కువ ఫీజుకే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.25 లక్షల ఉచిత వైద్యం అందించే ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని, నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లింపులు, బాండ్ల రూపంలో అప్పులుగా ఇస్తుండటంతో, ఆ తర్వాత కూడా మూడు వేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలకు దూరమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాడు--నేడు పనులను పూర్తిగా నిలిపేశారని, విలేజ్ క్లినిక్స్‌ను నిర్వీర్యం చేశారని, 108, 104 పరిస్థితి అగమ్యగోచరంగా తయారు చేశారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఎవరు భాగస్వాములైనా వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అరెస్టులకూ వెనుకాడబోమని, స్కామ్‌లు చేస్తూ ప్రజల ఆస్తులను లూటీ చేస్తామంటే ప్రజలు ఊరుకోరన్నారు.

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎరువుల సబ్సిడీ, సూక్ష్మ పరిశ్రమలకు ఆర్థిక చేయూత తదితర అంశాలపై కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. రబీ 2026-27 సీజన్‌కు ఎరువుల సబ్సిడీ కోసం రూ.62,370 కోట్లు కేటాయించారు. ఢిల్లీలో యుగే యుగీన్ భారత్ మ్యూజియం నిర్మాణానికి రూ.3,230 కోట్లు, నోయిడా--గ్రేటర్ నోయిడా మెట్రో విస్తరణకు రూ.2,390 కోట్లు మంజూరు చేశారు. సూక్ష్మ పరిశ్రమలకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ కోసం రూ.5,000 కోట్లు, స్టాండ్ అప్ ఇండియా పథకం క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌కు రూ.4,111 కోట్లను ఆమోదించారు. కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రబీ 2026--27 సీజన్‌కు సంబంధించి 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిఎపి, ఎన్‌పికెఎస్ తదితర భాస్వరం, పొటాష్ ఎరువులకు ఈ సబ్సిడీ వర్తిస్తుంది. గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈసారి సుమారు రూ.24,417 కోట్ల అదనపు నిధులను కేటాయించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువులు, ముడి పదార్థాల ధరల్లో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు అందించడమే ఈ నిర్ణయం లక్ష్యమని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

సూక్ష్మ పరిశ్రమలకు ఐదేళ్లపాటు రుణ చేయూత : సూక్ష్మ పరిశ్రమలకు రుణ సదుపాయాలు కల్పించే క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ (సిజిఎఫ్ఎంయు) పథకాన్ని 2031 మార్చి 31 వరకు కొనసాగించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.5,000 కోట్ల నిధిని కేటాయించారు. ప్రధానమంత్రి ముద్ర యోజన కింద అర్హత కలిగిన సూక్ష్మ సంస్థలకు పూచీకత్తు లేని రుణాలు అందించేందుకు ఈ నిధి ఉపయోగపడనుంది. అర్హత కలిగిన ముద్ర రుణాలపై గ్యారెంటీ రుసుమును ఏడాదికి ఒక శాతం నుంచి 0.75 శాతానికి తగ్గించారు. అలాగే, స్టాండ్ అప్ ఇండియా పథకాన్ని 2031 మార్చి 31 వరకు కొనసాగించేందుకు కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.4,111 కోట్ల క్రెడిట్ గ్యారెంటీ నిధికి ఆమోదం తెలిపింది. వచ్చే ఐదేళ్లలో అదనంగా 2.5 లక్షల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహకారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా అర్హులైన పారిశ్రామికవేత్తలకు బ్యాంకు రుణాలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ పథకం ఉద్దేశం.

దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రక నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ భవనాలను యుగే యుగీన్ భారత్ మ్యూజియంగా అభివృద్ధి చేయడానికి రూ.3,230 కోట్లు కేటాయించారు. సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ మ్యూజియాన్ని నిర్మించనున్నారు. దేశ నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వాన్ని ప్రతిబింబించేలా వివిధ గ్యాలరీలను ఏర్పాటు చేయనున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు దశలవారీగా పనులు చేపట్టనున్నారు. 2027 ద్వితీయార్థంలో తొలి గ్యాలరీని సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

- సోనియా ఆత్మకథ..
- బీజేపీకి కొత్త సవాల్
- ఆత్మకథ కాదు.. రాజకీయ అగ్నిపరీక్ష
- జ్ఞాపకాల తెర వెనుక.. వ్యక్తిగత వేదన...రాజకీయ వ్యూహం!
- చరిత్రకు సంజాయిషీనా.. రాజకీయాలకు సవాలా?

'బిలాంగింగ్' బాంబు..

మళ్లీ రగిలిన రాజకీయ యుద్ధం!

ఒక వ్యక్తి జీవిత చరిత్రగా వెలువడిన పుస్తకం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారడం అసాధారణమేమీ కాదు. కానీ ఆ వ్యక్తి ఆరు దశాబ్దాలుగా భారత రాజకీయాలను ప్రభావితం చేసిన నెహ్రూ–గాంధీ కుటుంబానికి చెందినవారైతే, ఆ పుస్తకంలోని ప్రతి జ్ఞాపకం, ప్రతి వ్యాఖ్య, ప్రతి మౌనం కూడా రాజకీయ అర్థాలను సంతరించుకుంటాయి. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రచించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఇప్పుడు అలాంటి చర్చకే కేంద్రబిందువైంది. వ్యక్తిగత జీవితం, ప్రేమ, కుటుంబ బంధాలు, విషాదాలు, రాజకీయ బాధ్యతలతో సాగిన తన ప్రయాణాన్ని సోనియా ఈ పుస్తకంలో ఆవిష్కరించారు. అయితే పుస్తకం విడుదలైన వెంటనే అది రాజకీయ విమర్శలు, చారిత్రక వివాదాలు, ప్రచురణ స్వేచ్ఛపై ప్రశ్నలకు వేదిక కావడం గమనార్హం.

ఇటలీ నుంచి భారత రాజకీయాల కేంద్రం వరకు : ఇటలీలోని సాధారణ కుటుంబంలో జన్మించిన సోనియా మైనో, కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీని కలుసుకోవడం, ప్రేమ, వివాహం, భారతదేశానికి రావడం, ఇందిరా గాంధీ కుటుంబంలోకి అడుగుపెట్టడం వరకు సాగిన జీవన ప్రయాణం ఈ పుస్తకానికి ప్రధాన నేపథ్యం. ఒక విదేశీ యువతిగా భారతీయ కుటుంబ, సామాజిక, సాంస్కృతిక వాతావరణంలో తన స్థానాన్ని ఏర్పరచుకోవడం ఆమెకు సులభమైన ప్రయాణం కాదు. రాజకీయాలకు దూరంగా ఉండాలని కోరుకున్న ఆమె, కుటుంబంలో వరుసగా చోటుచేసుకున్న విషాదాల అనంతరం అనివార్యంగా రాజకీయాల వైపు అడుగులు వేయాల్సి వచ్చింది. 1984లో ఇందిరా గాంధీ హత్య, 1991లో రాజీవ్ గాంధీ హత్య ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చిన సంఘటనలు. ఈ రెండు హత్యలు ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, భారత రాజకీయ వ్యవస్థను కూడా తీవ్రంగా ప్రభావితం చేశాయి. వ్యక్తిగత విషాదం నుంచి రాజకీయ బాధ్యత వైపు సాగిన సోనియా ప్రయాణాన్ని అర్థం చేసుకోవడానికి ఈ నేపథ్యం కీలకం. 1998లో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి, పార్టీని తిరిగి అధికార పోటీలో నిలబెట్టే ప్రయత్నం చేయడం ఆమె రాజకీయ జీవితంలో ముఖ్యమైన మలుపు.

2004లో ప్రధాని పదవి నిరాకరణ.. త్యాగమా, వ్యూహమా? : ఈ పుస్తకంలో అత్యంత రాజకీయ ప్రాధాన్యం కలిగిన అంశాల్లో 2004లో ప్రధానమంత్రి పదవిని స్వీకరించకూడదన్న సోనియా నిర్ణయం ఒకటి. యూపీఏ కూటమి విజయం సాధించిన తర్వాత ఆమె ప్రధాని అవుతారని విస్తృతంగా ప్రచారం జరిగింది. కానీ చివరకు మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేశారు. ఆ నిర్ణయాన్ని అప్పట్లో కాంగ్రెస్ ఒక నైతిక, రాజకీయ త్యాగంగా ప్రచారం చేయగా, ప్రత్యర్థులు మాత్రం దాని వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయని విమర్శించారు.

తన పిల్లలు రాహుల్, ప్రియాంకలు కుటుంబం ఎదుర్కొన్న హత్యల విషాదం నేపథ్యంలో తాను ప్రధానమంత్రి పదవి చేపట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారని సోనియా తన జ్ఞాపకాల్లో పేర్కొన్నట్లు పుస్తకంపై వచ్చిన కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ వివరణ ఆమె నిర్ణయానికి వ్యక్తిగత కోణాన్ని అందిస్తుంది. అయితే రాజకీయ విశ్లేషణలో మరో ప్రశ్న కూడా తప్పనిసరిగా నిలుస్తుంది. ప్రధాని పదవిని నిరాకరించినప్పటికీ, యూపీఏ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, జాతీయ సలహా మండలి ద్వారా విధాన నిర్ణయాలపై ఆమె ప్రభావం కొనసాగింది. అందువల్ల ఆ నిర్ణయాన్ని కేవలం త్యాగంగా చూడాలా, లేక అధికారాన్ని ప్రత్యక్షంగా చేపట్టకుండా రాజకీయ ప్రభావాన్ని కొనసాగించిన వ్యూహంగా విశ్లేషించాలా అన్న చర్చకు ఇంకా అవకాశం ఉంది.



షా బానో నుంచి ఆపరేషన్ బ్లూస్టార్ వరకు.. వివాదాస్పద చరిత్రకు వ్యక్తిగత వివరణ : 'బిలాంగింగ్' ప్రాధాన్యం కేవలం కుటుంబ జ్ఞాపకాలకే పరిమితం కాదు. కాంగ్రెస్ పాలనలో వివాదాస్పదంగా నిలిచిన కొన్ని కీలక సంఘటనలపై సోనియా తన దృక్కోణాన్ని వెల్లడించడం ఈ పుస్తకాన్ని రాజకీయంగా మరింత ప్రాధాన్యమైనదిగా మార్చింది.

షా బానో కేసులో అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం తీసుకున్న వైఖరిపై తాను ప్రశ్నలు లేవనెత్తినట్లు సోనియా పేర్కొన్నట్లు తాజా కథనాలు వెల్లడించాయి. ముస్లిం మహిళల హక్కుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆమెకు అసంతృప్తి ఉన్నట్లు ఈ జ్ఞాపకం సూచిస్తోంది. ఇది రాజీవ్ గాంధీ ప్రభుత్వ నిర్ణయాలపై కుటుంబ అంతర్గతంగా కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే చర్చకు దారితీస్తుంది. అయితే ఈ ఒక్క జ్ఞాపకం ఆధారంగా ఆ ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన పూర్తి రాజకీయ, న్యాయపరమైన బాధ్యతలను అంచనా వేయలేం.

ఆపరేషన్ బ్లూస్టార్, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, బాబ్రీ మసీదు కూల్చివేత, బట్లా హౌస్ ఎన్‌కౌంటర్, 26/11 ముంబై ఉగ్రదాడులు వంటి అంశాల ప్రస్తావన కూడా రాజకీయ చర్చకు కారణమైంది. ముఖ్యంగా 1984 అల్లర్లలో బాధితులకు న్యాయం, కాంగ్రెస్ నాయకులపై వచ్చిన ఆరోపణలు, అప్పటి ప్రభుత్వ వైఖరి వంటి అంశాలు ఇప్పటికీ సున్నితమైన చారిత్రక ప్రశ్నలుగానే ఉన్నాయి. వాటిపై వ్యక్తిగత జ్ఞాపకాలు ఒక కోణాన్ని చూపగలవు. కానీ బాధితుల అనుభవాలు, అధికారిక విచారణలు, న్యాయస్థానాల తీర్పులు, చారిత్రక ఆధారాలు కలిపి పరిశీలించినప్పుడే సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.

ప్రచురణ సంస్థ మార్పు.. భావప్రకటన స్వేచ్ఛపై ప్రశ్నలు : పుస్తకం విడుదలకు ముందే చోటుచేసుకున్న ప్రచురణ సంస్థల వివాదం దాని రాజకీయ ప్రాధాన్యాన్ని మరింత పెంచింది. తొలుత పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకు ముందుకొచ్చినప్పటికీ, రచయిత్రి బృందంతో కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆ ఒప్పందం ముందుకు సాగలేదు. అనంతరం హార్పర్‌కాలిన్స్ ఇండియా పుస్తకాన్ని ప్రచురించింది.

ప్రధాని నరేంద్ర మోదీ పాలన, ఆర్ఎస్ఎస్, మత సామరస్యం, మైనారిటీల పరిస్థితి, గల్వాన్ పరిణామాలు వంటి అంశాలపై ఉన్న వ్యాఖ్యలకు సంబంధించి సంపాదకీయ మార్పులు, తొలగింపులపై విభేదాలు వచ్చాయని వార్తా కథనాలు పేర్కొన్నాయి. సోనియా ఈ పరిణామాన్ని తన పుస్తకంపై సెన్సార్ ప్రయత్నంగా అభివర్ణించగా, పెంగ్విన్ మాత్రం బాహ్య రాజకీయ ఒత్తిడి లేదని, సాధారణ సంపాదకీయ సమీక్షలో ఒక అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడమే కారణమని స్పష్టం చేసింది. కాబట్టి ప్రచురణ సంస్థపై ప్రభుత్వ ఒత్తిడి ఉందని నిర్ధారిత వాస్తవంగా చెప్పడం సరికాదు. కానీ రాజకీయంగా సున్నితమైన అంశాలపై రచయిత స్వేచ్ఛ, ప్రచురణ సంస్థ సంపాదకీయ బాధ్యతల మధ్య ఏర్పడిన సంఘర్షణ మాత్రం చర్చించాల్సిన అంశమే.

ఈ వివాదం మరో ప్రశ్నను ముందుకు తెచ్చింది. ఒకే పుస్తకానికి అంతర్జాతీయ ఎడిషన్‌లో ఒక సమాచారం, భారతీయ ఎడిషన్‌లో మరో సమాచారం ఉంటే పాఠకుల విశ్వాసం దెబ్బతినదా? రచయిత అభిప్రాయాలను ప్రచురణ సంస్థ ఎంతవరకు మార్చవచ్చు? చట్టపరమైన పరిమితులు, పరువు నష్టం భయం, వాస్తవ నిర్ధారణ వంటి అంశాలు సంపాదకీయ నిర్ణయాల్లో భాగమే అయినప్పటికీ, రాజకీయంగా అసౌకర్యం కలిగించే వ్యాఖ్యలను తొలగించాలనే ఒత్తిడి ఎక్కడి నుంచైనా వస్తే అది భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన విస్తృత చర్చకు దారితీస్తుంది.

ప్రణబ్ ముఖర్జీ ప్రస్తావన.. కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై కొత్త చర్చ : పుస్తకంలోని మరో రాజకీయ అంశం మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి సంబంధించినది. ప్రధానమంత్రి పదవిపై ఆయనకు దీర్ఘకాలంగా ఆకాంక్ష ఉండేదన్న తన అభిప్రాయాన్ని సోనియా వెల్లడించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. దీనిపై ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ స్పందిస్తూ, దశాబ్దాల రాజకీయ అనుభవం, కృషి, ప్రతిభ ఆధారంగా ఉన్నత పదవిని ఆశించడం తప్పు కాదని వ్యాఖ్యానించారు. ఈ స్పందన ఒక వ్యక్తిగత జ్ఞాపకం ఎలా కుటుంబాల మధ్య, రాజకీయ వర్గాల మధ్య చర్చకు దారితీస్తుందో చూపిస్తోంది.

ఈ అంశం కాంగ్రెస్ పార్టీలో నాయకత్వం, అధికార కేంద్రం, నిర్ణయాధికారం ఎలా పనిచేశాయన్న ప్రశ్నను కూడా మళ్లీ ముందుకు తెస్తుంది. సోనియా అధ్యక్షురాలిగా ఉన్న కాలంలో పార్టీ కీలక నిర్ణయాల్లో ఎవరి పాత్ర ఎంత? మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో పార్టీ నాయకత్వం, ప్రభుత్వ నాయకత్వం మధ్య సంబంధం ఎలా ఉండేది? ఇలాంటి ప్రశ్నలకు ఒకరి జ్ఞాపకాలు సమాధానమివ్వలేవు. ఇతర నేతల సాక్ష్యాలు, ప్రభుత్వ రికార్డులు, అప్పటి రాజకీయ పరిణామాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

బీజేపీ విమర్శనాస్త్రం.. : పుస్తకం విడుదలైన వెంటనే బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. నెహ్రూ–గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పాలనలో జరిగిన చారిత్రక తప్పిదాలను పుస్తకం సమర్థించుకునే ప్రయత్నం చేస్తోందని బీజేపీ నేతలు విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు సోనియా తన అనుభవాలను చెప్పుకునే హక్కును సమర్థిస్తూ, పాత వివాదాలను రాజకీయ ప్రయోజనాల కోసం తిరిగి తెరపైకి తెస్తున్నారని బీజేపీపై ఆరోపణలు చేశారు.

ఈ విమర్శలు రెండు పార్టీలకూ రాజకీయంగా ఉపయోగపడే అవకాశముంది. బీజేపీకి కాంగ్రెస్ గత పాలనలోని వివాదాలను మరోసారి ప్రస్తావించి, నెహ్రూ--గాంధీ కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ప్రశ్నించే అవకాశం లభిస్తుంది. కాంగ్రెస్‌కు మాత్రం తన పాలనలోని నిర్ణయాలకు వివరణ ఇచ్చుకోవడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వంపై తన విమర్శలను ప్రజల్లోకి తీసుకెళ్లే వేదిక ఏర్పడుతుంది. ముఖ్యంగా రాహుల్ గాంధీ ప్రతిపక్ష రాజకీయాల్లో చురుకుగా ఉన్న సమయంలో తల్లి సోనియా రాసిన పుస్తకం కాంగ్రెస్ రాజకీయ కథనానికి అదనపు బలాన్ని ఇవ్వవచ్చు. అయితే పుస్తకం ఒక్కటే కాంగ్రెస్‌కు ఎన్నికల విజయాన్ని తెచ్చిపెడుతుందని భావించడం అతిశయోక్తి.

జ్ఞాపకాలు చరిత్ర కావు.. పరిశీలనకు ఆహ్వానం : పుస్తకంలోని కొన్ని చారిత్రక వివరాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. ఆర్ఎస్ఎస్ స్థాపన, అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, అహ్మద్ పటేల్ మరణానికి సంబంధించిన తేదీలపై తప్పులున్నాయంటూ కొన్ని వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ ఆరోపణలను స్వతంత్రంగా ధ్రువీకరించకుండా తుది నిర్ధారణగా స్వీకరించకూడదు. అయితే ఒక రాజకీయ నాయకురాలు రాసిన జ్ఞాపకాల పుస్తకంలో చారిత్రక వివరాల ఖచ్చితత్వం ఎంత ముఖ్యమో ఈ వివాదం గుర్తుచేస్తోంది.

జ్ఞాపకాలు వ్యక్తిగత అనుభవాల ఆధారంగా ఉంటాయి. ఒకే సంఘటనను చూసిన ఇద్దరు వ్యక్తులు భిన్నంగా గుర్తుంచుకోవచ్చు. అందువల్ల సోనియా చెప్పిన ప్రతి విషయాన్ని అక్షర సత్యంగా స్వీకరించడం ఎంత తప్పో, రాజకీయ వ్యతిరేకతతో ప్రతి విషయాన్ని కొట్టిపారేయడం కూడా అంతే తప్పు. పాఠకులు ఆధారాలు, ఇతరుల వాంగ్మూలాలు, అధికారిక పత్రాలు, న్యాయస్థానాల తీర్పులతో పోల్చి పరిశీలించాలి.


రాజకీయ వారసత్వంపై అంతిమ తీర్పు పాఠకులదే : 'బిలాంగింగ్'ను సోనియా గాంధీ తన జీవితానికి ఇచ్చుకున్న వ్యక్తిగత వివరణగా చూడవచ్చు. అదే సమయంలో అది భారత రాజకీయ చరిత్రలో కీలక ఘట్టాలను ఒక ప్రముఖ రాజకీయ కుటుంబం అంతర్గత కోణం నుంచి చూపించే పత్రంగా కూడా నిలుస్తుంది. కానీ ఈ పుస్తకం చరిత్రకు అంతిమ తీర్పు కాదు. కాంగ్రెస్ పాలనపై వచ్చిన విమర్శలకు పూర్తి సమాధానం కూడా కాదు. ప్రస్తుత ప్రభుత్వంపై చేసిన విమర్శలకు స్వతంత్ర ఆధారం కూడా కాదు.

ఒక ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులకు తమ అనుభవాలను, అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఎంత ముఖ్యమో, ఆ అభిప్రాయాలను ప్రశ్నించే పాఠకుల హక్కు కూడా అంతే ముఖ్యం. సోనియా గాంధీ తన కథను చెప్పుకున్నారు. ఇప్పుడు ఆ కథలోని వాస్తవాలను పరిశీలించడం, విభిన్న దృక్కోణాలను వినడం, రాజకీయ ప్రచారానికి అతీతంగా చరిత్రను అర్థం చేసుకోవడం ప్రజల ముందున్న బాధ్యత.

అంతిమంగా 'బిలాంగింగ్' పుస్తకం సోనియా గాంధీ రాజకీయ జీవితానికి ముగింపు వ్యాఖ్య కాదు. అది నెహ్రూ–గాంధీ కుటుంబ వారసత్వం, కాంగ్రెస్ గతం, ప్రస్తుత అధికార రాజకీయాలు, భావప్రకటన స్వేచ్ఛపై దేశవ్యాప్తంగా మరోసారి చర్చకు తెరలేపిన సందర్భం. పుస్తకంపై బీజేపీ విమర్శలు, కాంగ్రెస్ సమర్థనలు కొంతకాలం రాజకీయ వేడిని పెంచవచ్చు. కానీ దాని నిజమైన విలువ రాజకీయ పార్టీల ప్రచారంలో కాదు; పాఠకులు దానిని ఎంత విమర్శనాత్మకంగా చదివి, భారత ప్రజాస్వామ్య చరిత్రను ఎంత సమగ్రంగా అర్థం చేసుకుంటారన్నదానిలోనే ఉంటుంది.

పార్లమెంటు ప్రొరోగేషన్‌పై రాజకీయ వ్యూహమా?

- 88 రోజులుగా ప్రొరోగేషన్ లేకపోవడంలో ఆంతర్యమేమిటి?
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై మళ్లీ చర్చకు రంగం సిద్ధమవుతోందా?



భారత పార్లమెంటరీ చరిత్రలో ఒక ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా పార్లమెంటు సమావేశాలు ముగిసిన కొద్ది రోజుల్లోనే అధికారికంగా ముగింపు ఉత్తర్వులు వెలువడుతుంటాయి. కానీ 2026 వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన 88 రోజులు గడిచినా ఇప్పటివరకు అధికారికంగా ముగియలేదు. దీంతో 2008లో నమోదైన 87 రోజుల రికార్డు బద్దలైంది. లోక్‌సభ, రాజ్యసభలను ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేయకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

పార్లమెంటు సమావేశాలను నిరవధికంగా వాయిదా వేయడం, అధికారికంగా ప్రొరోగ్ చేయడం రెండూ వేర్వేరు ప్రక్రియలు. సభ నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, రాష్ట్రపతి ప్రొరోగేషన్ ప్రకటించే వరకు ఆ సమావేశాలు అధికారికంగా ముగిసినట్లు పరిగణించరు. ఈ వ్యత్యాసమే ప్రస్తుత పరిణామానికి కేంద్రబిందువు. సమావేశాలను ప్రొరోగ్ చేయకుండా ఉంచడం వల్ల అవసరమైతే కేవలం రెండు రోజుల ముందస్తు నోటీసుతోనే అదే సమావేశాలను తిరిగి నిర్వహించవచ్చు. కొత్త సమావేశాలను ఏర్పాటు చేయాలంటే కనీసం 14 రోజుల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం ఎందుకు కొనసాగిస్తోందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

దీని వెనుక మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశాలు ఉన్నాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ ప్రతిపాదన గత ఏప్రిల్‌లో పార్లమెంటులో తగిన మద్దతు పొందలేకపోయింది. లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో బిల్లు వీగిపోయింది. మరోవైపు ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలను నియోజకవర్గాల పునర్విభజన ద్వారా గరిష్ఠంగా 850కి పెంచే ప్రతిపాదన కూడా రాజకీయంగా కీలకంగా మారింది. ఈ రెండు అంశాలపై మరోసారి చర్చించేందుకు కేంద్రం ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే, సమావేశాలను ఇంతకాలం అధికారికంగా ముగించకపోవడాన్ని రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా పరిగణించలేం. నిరవధికంగా వాయిదా పడిన తరువాత ఎన్ని రోజుల్లోగా ప్రొరోగేషన్ ప్రకటించాలనే విషయంపై రాజ్యాంగంలో నిర్దిష్ట కాలపరిమితి లేదు. అందువల్ల ఈ వ్యవహారంలో రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘన జరిగిందని ముందుగానే నిర్ధారించడం సమంజసం కాదు. కానీ చట్టపరంగా అవకాశం ఉందన్న కారణంతోనే ప్రభుత్వ నిర్ణయాలపై రాజకీయ, ప్రజాస్వామ్యపరమైన ప్రశ్నలు అడగకూడదని భావించడం కూడా సరికాదు.

పార్లమెంటు అనేది ప్రభుత్వ నిర్ణయాలకు ఆమోదముద్ర వేసే వేదిక మాత్రమే కాదు. ప్రజల సమస్యలను చర్చించే, ప్రభుత్వాన్ని ప్రశ్నించే, విధానాలను సమీక్షించే అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి దేశ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై సమగ్ర చర్చ జరగాలి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన విషయంలో రాష్ట్రాల మధ్య సమతుల్యత, జనాభా ప్రాతిపదిక, సమాఖ్య వ్యవస్థ ప్రయోజనాలు వంటి అంశాలను విస్మరించకూడదు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై తలెత్తే ఆందోళనలకు కూడా స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.

ప్రతిపక్షాలు కూడా రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మక చర్చలకు సిద్ధపడాలి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టాలనుకుంటే వాటి ఉద్దేశాలు, విధివిధానాలు, ప్రభావాలపై ముందుగానే స్పష్టత ఇవ్వాలి. పార్లమెంటరీ సంప్రదాయాలను రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటున్నారనే అనుమానాలకు తావివ్వకూడదు.

పార్లమెంటు సమావేశాలను అధికారికంగా ముగించకుండా ఉంచడం నిబంధనలకు విరుద్ధం కాకపోవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రతి అధికారిక నిర్ణయానికి ప్రజల పట్ల జవాబుదారీతనం ఉండాలి. మహిళా సాధికారత, సమాఖ్య స్ఫూర్తి, ప్రజాప్రాతినిధ్యం వంటి కీలక అంశాలు రాజకీయ వ్యూహాలకు పరిమితం కాకూడదు. పార్లమెంటు వేదికగా విస్తృత చర్చ జరగాలి. ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యమిచ్చినప్పుడే పార్లమెంటరీ సంప్రదాయాలకు నిజమైన గౌరవం లభిస్తుంది.

ఈవీఎంల తనిఖీలు...వివాదాలెందుకు?



దేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశం రాజకీయ చర్చకు దారితీస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) తనిఖీలు మరోసారి వివాదాస్పదంగా మారాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమవుతున్న వేళ ఈవీఎంల పరిశీలనకు ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలపై కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా చేపట్టే సాధారణ ప్రక్రియగా ఎన్నికల సంఘం ఈ తనిఖీలను సమర్థిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం వాటి ఉద్దేశం, నిర్వహణ తీరుపై సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఓటరు తీర్పే అత్యంత కీలకం. ఆ తీర్పును ప్రతిబింబించే యంత్రాల విశ్వసనీయతపై ఎలాంటి అనుమానాలు ఉండకూడదు. సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నికల నిర్వహణలో వేగం, సౌలభ్యం పెరిగినప్పటికీ, ఆ సాంకేతికతపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఈవీఎంల పనితీరు, వాటి భద్రత, ఓట్ల నమోదు, లెక్కింపు ప్రక్రియలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడం ద్వారా మాత్రమే అపోహలకు అడ్డుకట్ట వేయగలుగుతారు.

ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల తనిఖీలకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టడం వెనుక సాధారణ పరిపాలనా కారణాలు ఉండవచ్చు. ఎన్నికలకు ఉపయోగించే యంత్రాలు సాంకేతికంగా సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది ముందుగానే నిర్ధారించుకోవడం అవసరమే. అయితే, ఇలాంటి కీలకమైన ప్రక్రియల్లో రాజకీయ పార్టీలకు సమాచారం అందించడం, వారి ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు నిర్వహించడం, ప్రతి దశను పారదర్శకంగా ఉంచడం కూడా అంతే ముఖ్యం. ప్రక్రియ ఎంత నిష్పాక్షికంగా ఉన్నా, దాని నిర్వహణపై అనుమానాలు తలెత్తితే ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉంది.

కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం వాస్తవాలు, సాంకేతిక వివరాలతో సమాధానమివ్వాలి. కేవలం ప్రకటనలతో అనుమానాలు తొలగిపోవు. తనిఖీలకు సంబంధించిన నిబంధనలు, యంత్రాల వివరాలు, పరీక్షల విధానం, ఫలితాలను బహిరంగంగా వెల్లడించాలి. రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలి. అవసరమైన చోట స్వతంత్ర సాంకేతిక నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలా చేస్తే రాజకీయ ఆరోపణలకు తావు తగ్గుతుంది.

అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఎన్నికల్లో పరాజయం ఎదురైన ప్రతిసారీ ఈవీఎంలను తప్పుబట్టడం, విజయం సాధించినప్పుడు వాటి విశ్వసనీయతను ప్రశ్నించకపోవడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ఏదైనా అక్రమం జరిగిందని భావిస్తే అందుకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచి, చట్టబద్ధమైన మార్గాల్లో సవాలు చేయాలి. ఆధారాలు లేని ఆరోపణలు ప్రజల్లో అనవసర గందరగోళాన్ని సృష్టిస్తాయి.

ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ. దాని నిర్ణయాలు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా ఉండాలి. అదే సమయంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ సంస్థా ప్రజలకు జవాబుదారీతనం నుంచి మినహాయింపు పొందలేదు. ప్రతిపక్షాల ప్రశ్నలను శత్రుత్వంగా చూడకుండా, వాటిని వ్యవస్థను మెరుగుపరిచే అవకాశంగా స్వీకరించాలి.

ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం చేకూరుతుంది. ఈవీఎంల తనిఖీల విషయంలోనూ ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే పారదర్శకత, సాంకేతిక ఆధారాలు, నిష్పాక్షికతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సంఘం తన చర్యల ద్వారా విశ్వాసాన్ని కల్పించాలి. రాజకీయ పార్టీలు తమ విమర్శల్లో బాధ్యతను పాటించాలి. అంతిమంగా గెలవాల్సింది ఏ రాజకీయ పార్టీయో కాదు.. ప్రజాస్వామ్యమే!

మేడ్చల్ జిల్లాలోని 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

- రైతులకు కుటుంబానికి 50 వేల తక్షణ సాయం అందించాలి
- జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా.. రాష్ట్ర ప్రభుత్వానికి వి.ఎస్. బోస్ డిమాండ్



మల్కాజిగిరి, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : కరువు పరిస్థితులతో పంటలు నష్టపోయి, ఉపాధి కోల్పోతున్న రైతులు, కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ డిమాండ్ చేశారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. కరువు ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఈ సందర్భంగా నాయకులు నినదించారు.

ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన వి.ఎస్. బోస్ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోని ఐదు మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించకపోవడం వల్ల మిగిలిన ప్రాంతాల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కరువు కారణంగా ఉపాధి కోల్పోతున్న పట్టణ ప్రాంత కార్మికులకు వికసిత్ భారత్--జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి హామీ కల్పించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతు కుటుంబానికి రూ.50 వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని కోరారు. వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి సేకరించిన అభిప్రాయాలను తక్షణమే అమలు చేయాలని, సమావేశాలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని బోస్ సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

పర్యావరణ కాలుష్యమే కరువు తీవ్రతకు కారణం: ఉమామహేష్

సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితుల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యం, అడవుల నరికివేత, మైనింగ్ కార్యకలాపాలు ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని అన్నారు. అడవులను నరికివేస్తూ, మైనింగ్ ద్వారా అధిక లాభాలు ఆర్జిస్తున్న పెట్టుబడిదారీ సంస్థల కారణంగా పర్యావరణానికి నష్టం జరుగుతోందని ఆయన ఆరోపించారు. పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే వర్గాలపై పన్నులు పెంచి, పేద ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నీటి లభ్యత తక్కువగా ఉన్న రాష్ట్రాలకు నీటి వనరులు సమృద్ధిగా ఉన్న రాష్ట్రాల నుంచి తాగునీటిని సరఫరా చేసి ప్రజలను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తక్షణ కరువు సహాయ ప్యాకేజీ ప్రకటించి ప్రజలకు భరోసా కల్పించాలని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచాలని, రైతులకు మేలు చేసే విధానాలు తీసుకురావాలని, పట్టణ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి హామీ కల్పించాలని డిమాండ్ చేశారు. కరువు సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికే పరిమితం చేయకుండా కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం

ధర్నా అనంతరం సీపీఐ నాయకులు జిల్లా డిప్యూటీ కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చైతన్య గీతాలను ఆలపించి కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉద్యమ స్ఫూర్తిని నింపారు.

పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డీజీ సాయిల్ గౌడ్, కే. ఏసురత్నం, కే. ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి అన్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మి, రచ్చ కిషన్, కృష్ణ, సత్యప్రసాద్, వి. శ్రీనివాస్, నిమ్మల నరసింహులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, కార్యదర్శి మాధవి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు, నరేంద్ర ప్రసాద్, అమరావతి బాబు, యాదగిరి, దశరథ్, బాపిరాజు, ఈశ్వర్, రాములు గౌడ్ , ప్రజానాట్య మండలి అధ్యక్షురాలు ప్రమీల, కార్యదర్శి వి. వెంకటాచారి, గౌరవ అధ్యక్షుడు ప్రవీణ్, మహిళా సమాఖ్య నాయకురాళ్లు గిరిజ, మహాలక్ష్మి, లత, నర్సమ్మ, సువర్ణ, కవిత, అనసూయ, పార్టీ నాయకులు వెంకటేష్, బాలరాజు,

నాగరాజు, ఇస్తారి, మహేష్, చంద్రయ్య, సత్యనారాయణ, బాబు, సదానందం, అజీమ్, కృష్ణ, నర్సయ్యతో పాటు వందలాది మంది పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సఫిల్‌గూడ చెరువు పేరు మార్చొద్దు..

- వినాయక సాగర్‌గా నామకరణం చేసే ప్రతిపాదనపై తుది నిర్ణయం వచ్చేవరకు ప్రస్తుత పేరునే కొనసాగించాలి
- మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌కు వాకర్స్ క్లబ్, రాజకీయ పార్టీల ప్రతినిధుల వినతి



మల్కాజిగిరి, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : సఫిల్‌గూడ చెరువు పేరును మార్చకుండా చూడాలని, చెరువుకు సంబంధించిన నామకరణంపై తుది నిర్ణయం తీసుకునే వరకు ఎలాంటి మార్పులు చేపట్టవద్దని సఫిల్‌గూడ వాకర్స్ క్లబ్‌తో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. సఫిల్‌గూడ చెరువుకు ఇప్పటికే 'వినాయక సాగర్'గా పేరు పెట్టాలని కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ అంశంపై కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీలో తుది నిర్ణయం తీసుకునే వరకు మరో పేరు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా చెరువు పేరును ఆకర్షణీయంగా కనిపించేలా ఎల్ఈడీ అక్షరాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. సఫిల్‌గూడ చెరువును కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. మల్కాజిగిరి చౌరస్తాలో ఎన్ఎస్‌డీపీ నిధుల జ్ఞాపికగా ఏర్పాటు చేసిన పైలాన్ చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించేలా గ్రీనరీ ఏర్పాటు చేయాలని ప్రతినిధులు మరో విజ్ఞప్తి చేశారు. పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రవణ్, జనసేన నాయకుడు రమేష్, కరణం గోపి, బత్తిన నర్సింహా గౌడ్, స్టైదర్ శ్రీనివాస్, జెనిగ అశోక్ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, బాల్చేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పిట్టల శ్రీనివాస్ చరవాణి ద్వారా తమ మద్దతు తెలియజేశారు. సఫిల్‌గూడ చెరువు పేరుతో పాటు దాని అభివృద్ధి, మల్కాజిగిరి చౌరస్తా సుందరీకరణ అంశాలపై అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ ఉన్నతాధికారులకు పోలీసు భద్రత కల్పించాలి

- పొలిటీషియన్స్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ ఇంద్రపల్లి డిమాండ్



హైదరాబాద్, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : దేశ రక్షణ, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన అధికారులకు జీవితాంతం పోలీసు రక్షణ, భద్రత కల్పించాలని పొలిటీషియన్స్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ ఇంద్రపల్లి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత సైన్యంలో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులు, న్యాయమూర్తులు, ఎన్నికల కమిషనర్లు, పోలీసు శాఖలో విధులు నిర్వహించి రిటైర్ అయిన ఉన్నతాధికారులకు ప్రత్యేక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దేశ సేవలో తమ జీవితాలను అంకితం చేసిన ఇలాంటి అధికారుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సేవలకు తగిన గౌరవం కల్పించేలా జీవితాంతం పోలీసు ప్రొటెక్షన్ అందించే విధంగా విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని వెంకటేష్ ఇంద్రపల్లి కోరారు.

అక్రమంగా బోర్లు వేస్తే చర్యలు తప్పవు..

- కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాలతో అక్రమ బోర్ల సీజ్



జవహర్‌నగర్, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : అనుమతులు లేకుండా అక్రమంగా బోర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కాప్రా తహసీల్దార్ మతిన్ హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు అక్రమంగా వేసిన బోర్లపై చర్యలు చేపట్టారు.కాప్రా పరిధిలోని ఎల్లారెడ్డిగూడ, దుర్గానగర్, వెస్టన్ హిల్స్, బీఎల్ఆర్ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బోర్లు వేసినట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ గిర్దావర్ స్వర్ణలత ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా బోర్లు వేయడం చట్టరీత్యా నేరమని అధికారులు స్పష్టం చేశారు. బోరు వేయాలనుకునే వారు ముందుగా సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు.ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూగర్భ జలాల వినియోగంపై ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమ బోర్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా రెవెన్యూ శాఖ తరఫున తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.

వినాయక్ నగర్ అభివృద్ధి పనులకు మోక్షమెప్పుడు..?

- 40 లక్షల నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు..
- వాటర్ వర్క్స్ జీఎంకు మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి వినతి



మల్కాజిగిరి, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి నియోజకవర్గం, వినాయక్ నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల అమలులో జరుగుతున్న జాప్యంపై మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల అవసరాల కోసం నిధులు మంజూరై, టెండర్ ప్రక్రియ సైతం పూర్తయినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సునీల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర్ నిధుల నుంచి 40 లక్షలు మంజూరైనప్పటికీ, ప్రతిపాదించిన ఆరు అభివృద్ధి పనుల్లో కేవలం ఒక పని మాత్రమే ప్రారంభమైందని, మిగిలిన ఐదు పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆమె తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను సైతం ప్రారంభించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నిస్తూ, తక్షణమే పనులు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా వినాయక్ నగర్‌లోని 24వ లేన్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, డ్రైనేజీ సమస్యలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప పడిపూజకు కేటీఆర్‌కు ఆహ్వానం

- ఈ నెల 15న కార్యక్రమానికి హాజరవుతానని తెలిపిన కేటీఆర్



శేర్లింగంపల్లి, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : శేర్లింగంపల్లి: నేతాజీ నగర్‌లోని గుల్మోహర్ పార్క్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న అయ్యప్ప పడిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పార్టీ నాయకుడు గుర్ల తిరుమలేష్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకిటి శంకర్, వడ్డే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పునరుద్ధరణకు ఈ నెల 21 వరకు గడువు

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పోరాటానికి ఫలితం
- అర్హులైన ఓటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: లక్ష్మీకాంత్ రెడ్డి



మల్కాజిగిరి, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడిన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటం ఫలించిందని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం కల్పించిందని వెల్లడించారు. మంగళవరం ఆనంద్‌బాగ్‌లోని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున పోరాటం చేసిందన్నారు. మెదక్, మల్కాజిగిరి ప్రాంతాల నుంచి సుమారు 100 కార్లలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి వెళ్లి ఎన్నికల సంఘం దృష్టికి ఓటర్ల సమస్యలను తీసుకెళ్లారని వివరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అందించిన సహకారం, నాయకత్వం కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నివాసం మారిన కారణంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడినవారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓట్లు నమోదయ్యాయనే కారణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో పేరు లేని వారు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అవసరమైన గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, పేరు లేకపోతే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని లక్ష్మీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, టీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, అశోక్ రెడ్డి, ఎస్.ఆర్. ప్రసాద్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, పిట్టల నాగరాజు, రాఘవన్, శ్రీకాంత్ ముదిరాజ్, లక్ష్మి, ఆశా, కుట్టి శ్రీనివాస్ యాదవ్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కపిల్, పార్థ, బాలరాజు యాదవ్, బ్రహ్మయ్య, పరమేశ్, రాము, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సోదరుల ఐక్యతకు సదర ఉత్సవాలు నిలువెత్తు ప్రతీక...!

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్న గారి రాఘవేంద్ర గౌడ్



మేడ్చల్ నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు యాదవ సోదరుల ఐక్యతకు సదర ఉత్సవాలు నిలువెత్తు ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్న గారి రాఘవేంద్ర గౌడ్ అన్నారు.మేడ్చల్ పట్టణ కేంద్రంలో టీం తల్వార్ ఏర్పాటు చేసిన సదర సమ్మేళన ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఉత్సవాల్లో భాగంగా దున్నపోతుల విన్యాసాలను తిలకించిన అనంతరం రాఘవేంద్ర గౌడ్ యాదవ సోదరులకు, నియోజకవర్గ ప్రజలకు సదర పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..."ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్ముడు ఇంద్రుడి గర్వాన్ని అణచి,గోవర్ధన గిరిని ఎత్తి గోవులను, యాదవులను రక్షించిన రోజుకు గుర్తుగా ఈ సదర పండుగను జరుపుకోవడం మన సాంప్రదాయం అని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన సంస్కృతిని చాటిచెప్పే ఇటువంటి పండుగలకు మరింత ఆదరణ పెరిగింది. మేడ్చల్ పట్టణంలో యాదవ సోదరులందరూ ఎంతో ఉత్సాహంగా,ఐక్యతతో ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయం అని కొనియాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ వెనుకబడిన వర్గాల, ముఖ్యంగా గొల్ల,కురుమ మరియు యాదవ సోదరుల సంక్షేమానికి కట్టుబడి ఉంది.సమాజంలో యాదవుల ఆర్థిక,రాజకీయ ఎదుగుదలకు మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలందరి మధ్య సోదరభావం మరింత పెంపొందాలని, ఆ శ్రీకృష్ణుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను."ఈ కార్యక్రమంలో గౌదవెళ్ళి మాజీ సర్పంచ్,గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్,మేడ్చల్ మాజీ కౌన్సిలర్లు పెంజర్ల స్వామి యాదవ్,కౌడే మహేష్ కురుమ,బత్తుల శివ కుమార్ యాదవ్,మాజీ డైరెక్టర్లు ఒగ్గు శంకర్ కురుమ,గౌర్ల ఎర్ర బీరప్ప కురుమ,మాజీ వార్డు మెంబర్ కౌడే నాగేందర్ కురుమ,మేడ్చల్ పట్టణ యాదవ,కురుమ సంఘం నాయకులు బత్తుల మధుకర్ యాదవ్,కౌడే భిక్షపతి,గౌర్ల మధు,ఒగ్గు సురేష్,కౌడే శ్రీశైలం,శ్రీరంగవరం నర్సింహ్మ,మైల జీతయ్య, పెంజర్ల భాస్కర్,ఒగ్గు వినోద్,కౌడే శ్రీనివాస్,పెంజర్ల వెంకటేష్ నాయకులు కార్యకర్తలు యువకులు మహిళలు,స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,ప్రజా ప్రతినిధులు,ఉత్సవ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో యాదవ సోదరులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- సభలో మండలానికి చెందిన సర్పంచుల వినతి



కడ్తాల్ నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లాలో కడ్తాల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి,తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మండల సమావేశంలో తీర్మానించిన మేరకు ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.మండలానికి చెందిన అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు కలిసి స్థానిక తహశీల్దార్ జయశ్రీ,ఎంపీడీవో సుజాత నాయక్ లకు వినతిపత్రాన్ని సమర్పించారు.మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షాలు సక్రమంగా కురవక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు వివరించారు.వ్యవసాయంపై ఆధారపడిన రైతులు పెట్టుబడులు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం కడ్తాల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి,పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మీదేవి నరసింహ,అద్దాల మహేందర్ గౌడ్,పాలకుర్ల కరుణాకర్ గౌడ్,బొప్పిడి గోపాల్,ఈర్లపల్లి రవి,నేనావత్ శ్రీను నాయక్,సేవ్య నాయక్,రామచందర్,అమర్ సింగ్,తేజీరామ్,చిట్టి రమేష్,ప్రేమ జవహర్ లాల్,పొగాకు సంధ్య,నాయిని యశోద,శారద తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిలబడే నాయకుడు సురేష్

- బీఆర్‌టీయు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్



మేడ్చల్ నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : ఎప్పటికప్పుడు కార్మికుల పక్షాన నిలబడుతూ, వారి సమస్యల పరిష్కారానికి మేడ్చల్ నియోజకవర్గ బీ ఆర్ టీ యు అధ్యక్షుడు వై. సురేష్ కృషి మరువలేనిదని మేడ్చల్ జిల్లా బీ ఆర్ టీ యు అధ్యక్షులు సంబు ప్రభాకర్ కొనియాడారు. సోమవారం వై. సురేష్ పుట్టినరోజు సందర్భంగా సంబు ప్రభాకర్ ఆధ్వర్యంలో బీ ఆర్ టీ యు నాయకులు, పలువురు కార్మికులు సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్మికులకు అండదండగా ఉంటూ సేవలందిస్తున్న సురేష్ లాంటి నాయకుడు ఈనాటి సమాజానికి ఎంతో మేలు అన్నారు. ఇలానే మరిన్ని పదవులు అధిరోహిస్తూ సురేష్ మారింత అభివృద్ధి చెందాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రాజేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగడిపేట్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పులిహోర పంపిణీ

● అన్నదానం మహాదానం - మాజీ జెడ్పిటిసి రామచంద్రం



గజ్వేల్, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రముఖ వ్యాపారవేత్త అక్కారం రవి ధనలక్ష్మి దంపతుల సౌజన్యంతో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జెడ్పిటిసి ఎంబరి రామచంద్రం మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి మంగళవారం పులిహోర పంపిణీ చేస్తున్న, ఆర్యవైశ్య నాయకులను అభినందించారు, ప్రతి ఒక్కరూ దైవభక్తి సేవాగుణం కలిగి ఉండాలని అన్నారు అనంతరం, కొమురవెల్లి ఆలయ మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అలాగే వివిధ సందర్భాల్లో అన్నదాన కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల భద్రయ్య, నాయకులు వెంకట్ రెడ్డి, కాశీనాథ్, కైలాస ప్రశాంత్, రాములు,సాంబయ్య, హనుమాన్ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు

రూ.40 లక్షల నిధులతో చేపట్టాల్సిన పనుల్లో జాప్యంపై అధికారులకు మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి వినతి



నేరెడ్‌మెట్, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : వినాయక్‌నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నిధుల నుంచి మంజూరైన రూ.40 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారితో చర్చించారు. టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ మొత్తం ఆరు పనుల్లో కేవలం ఒక పని మాత్రమే ప్రారంభమైందని, మిగిలిన ఐదు పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టెండర్లు పూర్తయిన పనులతో పాటు మిగిలిన పనులను కూడా వెంటనే ప్రారంభించి ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా వినాయక్‌నగర్‌లోని 24వ లేన్‌లో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ పనిని ప్రాధాన్యతతో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక చొరవ చూపి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యానం రాజ్యలక్ష్మి కోరారు.

ఆశ వర్కర్ల వేతన పెంపుపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.



రాజేంద్రనగర్, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్): రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఆశ వర్కర్లు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై ఒక వినతిపత్రం సమర్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు,ఆశ వర్కర్ల వేతనాన్ని రూ.18,000లకు పెంచుతూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు.సీఎం రేవంత్ రెడ్డి ఆశ వర్కర్ల జీతం రూ.18,000 ఇస్తామని ప్రకటించినప్పటికీ,అది ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో అమలు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఆశ వర్కర్ల సమస్యలను శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు.ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి,సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి,ఆశ వర్కర్లకు న్యాయం జరిగేలా తన వంతు పూర్తి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆశ వర్కర్లు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మియాపూర్ ప్రభుత్వ భూములను అమ్మాలని చూస్తే ఊరుకోం : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : మియాపూర్ సర్వే నంబర్లు 100, 101 లలోని 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూములను అమ్మాలని నిర్ణయించినట్లు ప్రకటించిన సందర్భంగా ఎం.ఏ. నగర్ కాలనీని క్షేత్రస్థాయిలో సందర్శించి అక్కడే నివాసం ఉంటూ వారి ఇల్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మియాపూర్ పరిధిలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాఫియాకు విక్రయించేందుకు కుట్ర పన్నుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 05 గుంటలు, సర్వే నంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటలు కలిపి మొత్తం సుమారు 550 ఎకరాల 39 గుంటల భూమి ఉంది. 1912 నాటి సర్వే రికార్డుల నుంచే ఇది సర్కారు భూమిగా నమోదై ఉంది. 1949లో జాగీర్ల రద్దుతో పూర్తిగా ప్రభుత్వ పరమైంది. ప్రైవేట్ వ్యక్తుల అక్రమ వాదనలను తోసిపుచ్చుతూ 2003లోనే హైకోర్టు ఈ భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. తాజాగా దశాబ్దాల న్యాయపోరాటానికి తెరదించుతూ సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వడం శుభపరిణామం అని పేర్కొన్నారు.అధికారం కోసం ఆస్తులు కాపాడుకోవడం కోసం పార్టీలు మారే ఎమ్మెల్యేకు ప్రజల అవసరాలపై ధ్యాస లేదని ధ్వజమెత్తారు. ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఈ భూముల అమ్మకం ప్రక్రియను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు, సొంత నియోజకవర్గంలో వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూములను రియల్ మాఫియా పంచుకుంటున్నా, కనీసం నోరు విప్పలేని అసమర్థుడని అన్నారు, ఈ వేల కోట్ల విలువైన ఆస్తిని ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా, ఖజానా నింపుకోవడానికో లేదా రియల్ ఎస్టేట్ వ్యాపారుల లాభాల కోసమో కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టాలని చూడటం దుర్మార్గమని, ప్రస్తుతం ఈ విస్తీర్ణంలో సుమారు 150 ఎకరాల్లో పేద ప్రజలు ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ వంటి కాలనీలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, మిగిలిన 400 ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, ఈ భూములను అమ్మి సొమ్ము చేసుకునే బదులు, అన్ని హంగులతో కూడిన ఒక పెద్దాసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ/ఇంజనీరింగ్



కళాశాల, ప్రజల ఆహ్లాదం కోసం పార్కులు మరియు నిరుపేదలకు పక్కా గృహనిర్మాణం వంటి ప్రజాహిత పనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు, శేరిలింగంపల్లి బిడ్డగా ఇక్కడి ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోనని ,తరతరాలుగా గుడిసెలు, ఇళ్లు వేసుకుని నివసిస్తున్న పేదల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు, శేరిలింగంపల్లి ప్రజలారా, మన భూములను మనమే రక్షించుకుందామని, మీకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవడానికి, మీ తరపున అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా నేను సిద్ధంగా ఉన్నానని స్థానిక నివాసితులకు ఆయన పూర్తి భరోసా కల్పించారు, ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే శేరిలింగంపల్లి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలపై పోరాటం ప్రారంభిస్తామని, బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని రవికుమార్ యాదవ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాణిక్ రావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు విజయేందర్, డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు సీతారామ రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గణేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాఘవేంద్ర రావు, నాగేశ్వర్ గౌడ్, సమ్మెట ప్రసాద్, మహేష్ యాదవ్, రాజేష్ గౌడ్, రాము, ప్రకాష్, ప్రవీణ్, మరియు స్థానిక బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిజాయితీతోనే సమృద్ధి సాధ్యం.....

● వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

నేరెడ్‌మెట్, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యార్థి దశ నుంచే నిజాయితీ, నైతిక విలువలను అలవర్చుకోవాలని, సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఉన్నతాధికారులు సూచించారు. మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న అవినీతి నిరోధక అవగాహన కార్యక్రమం–2026లో భాగంగా మంగళవారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు 'నిజాయితీతో సమృద్ధి' అనే అంశంపై తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి కళాశాల ఉపప్రధానాచార్యులు డా. అడవి రాజు అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ విభాగాధిపతి, ప్రధాన నిర్వాహకుడు డా. సీహెచ్. విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే నిజాయితీని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. సంస్థ సీనియర్ ఉప ప్రధాన నిర్వాహకురాలు రూత్ బెక్హామ్ విద్యార్థులతో నిజాయితీ ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఉపప్రధానాచార్యులు డా. అడవి రాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నైతిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అనంతరం పోటీల ఫలితాలను ప్రకటించారు. తెలుగు విభాగంలో ఎల్. మానస ప్రథమ, ఎన్. జస్వంత్ ద్వితీయ, ఇ. మల్లేశ్వరి తృతీయ బహుమతులు సాధించారు. ఆంగ్ల విభాగంలో మైమూనా ప్రథమ, శీలం సాహితి ద్వితీయ, మహమ్మద్ బురాన్ సాబ్ తృతీయ స్థానాల్లో నిలిచారు. హిందీ విభాగంలో అస్ఫియా బేగం ప్రథమ, ఉదయ్ సాహు ద్వితీయ, శిరీష తృతీయ బహుమతులు పొందారు.కళాశాల విద్యా సమన్వయకర్త గుణాకర్‌తో పాటు ప్రముఖులు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. డా. హరిత వ్యాఖ్యాతగా వ్యవహరించగా, డా. యాదగిరి వందన సమర్పణ చేశారు.



అనాథ వృద్ధుల మధ్య పుట్టినరోజు వేడుకలు





ఇబ్రహీంపట్నం, నవంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో ప్రముఖ సంఘసేవకుడు బజారు బిక్షపతి తన 42వ పుట్టినరోజు వేడుకలను మాతా పితరుల సేవాసదనంలో జరుపుకున్నారు. ఆశ్రమంలోని వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను సెలబ్రేట్ చేసుకున్నారు. అనంతరం అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు.వృద్ధుల మధ్యే.ఈ సందర్భంగా మాట్లాడిన బిక్షపతి,అందరూ ఉండి తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజు వేడుకలు జరుపుకునే భాగ్యం లేదని, ఎవరూ ఆందోళన చెందకూడదని అన్నారు. తనలాంటి వారిని సొంత పిల్లలుగా భావించి పుట్టినరోజు, పెళ్లి రోజు సంబరాలు సెలబ్రేట్ చేసుకోవాలని కోరారు.ఆశ్రమం పట్ల మమకారం.తన కూతురు బజారు దీక్షిత ప్రమాదవశాత్తు అకాల మరణం చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైన సమయంలో మాతా పితరుల సేవాసదనంలోని అనాథ వృద్ధులు గుర్తుకు వచ్చారని ఆయన తెలిపారు. అందుకే తన కూతురి పుట్టినరోజు వేడుకలను ఈ ఆశ్రమంలోనే నిర్వహించారని, ఈసారి తన పుట్టినరోజు వేడుకలను కూడా వారి మధ్యనే జరుపుకోవాలనిపించిందని అన్నారు. యువత కూడా తమ పుట్టినరోజు, పెళ్లి రోజు వేడుకలను అట్టహాసంగా కాకుండా అనాథలు, వృద్ధుల మధ్య జరుపుకుంటే పుణ్యం కలుగుతుందని సూచించారు. కార్యక్రమంలో మాతా పితరుల సేవాసదనం నిర్వాహకులు కోలా భాస్కరరావు,సీనియర్ జర్నలిస్ట్ దాయి శ్రీశైలం,ఆర్టీసీ కండక్టర్ జంగయ్య, ఎలిమినేడు గ్రామానికి చెందిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులు బిక్షపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విజయసాయిరెడ్డి... 'పరివర్తన రాజనీతి పార్టీ'



❍విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా ఆవిష్కరించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

❍కుటుంబ రాజకీయాలకు స్వస్తి.. యువతకు పెద్దపీట వేస్తామని ప్రకటన

విజయవాడ, నవంబర్ 11(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. మాజీ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకుడు వి. విజయసాయిరెడ్డి 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ)ని ప్రారంభించారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరును ప్రకటించడంతో పాటు జెండాను ఆవిష్కరించారు. 'దేశం కోసం.. ధర్మం కోసం' అనే నినాదంతో పార్టీ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.

తెలుపు, కాషాయ రంగులతో రూపొందించిన పార్టీ జెండా మధ్యలో ధర్మచక్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని విజయసాయిరెడ్డి ప్రకటించారు. రాష్ట్రభవిష్యత్తు ఏ ఒక్కనాయకుడి చేతుల్లోనో కాకుండా ప్రజల చేతుల్లోనే ఉంటుందని పేర్కొన్నారు. ఓటు వేయడంతోనే ప్రజల బాధ్యత ముగియదని, పాలకులు తప్పు చేసినప్పుడు ప్రశ్నించాలని, మంచి పనులు చేసినప్పుడు రాజకీయాలకు అతీతంగా అభినందించాలని పిలుపునిచ్చారు.

తాను ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో పార్టీని ఏర్పాటు చేయలేదని, యువతలో నాయకత్వ లక్షణాలను వెలికితీసి కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే ప్రధాన ఉద్దేశమని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాల్లో కుటుంబాల ఆధిపత్యానికి ముగింపు పలకాలని, అన్ని సామాజిక వర్గాల నుంచి సమర్థులైన నాయకులను ప్రోత్సహిస్తామని తెలిపారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు యువతకు అవకాశం కల్పిస్తామని, సగం స్థానాలను మహిళలకు కేటాయిస్తామని ప్రకటించారు.

రాష్ట్రంలో యువతకు 100 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత విద్యుత్ అందించడం, మధ్యతరగతి కుటుంబాల ఆదాయాన్ని పెంచడం తమ పార్టీ లక్ష్యాలని వివరించారు. ప్రజల ఆకాంక్షలను రాజకీయ ఎజెండాగా తీసుకొని, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం, దేశభక్తి, ధర్మ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ పనిచేస్తామని తెలిపారు.

గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంటరీ పార్టీ నేతగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి 2025 జనవరిలో పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన ఆయన, తాజాగా సొంత పార్టీ ఏర్పాటుతో తిరిగి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

రాష్ట్రంలో అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని లక్ష్యంగా ప్రకటించిన పరివర్తన రాజనీతి పార్టీకి ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుంది, ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు ఎంతమేరకు చేరుతారు, క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం ఎలా సాగుతుంది అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. కొత్త పార్టీ ఆవిర్భావంతో రాష్ట్ర రాజకీయాల్లో మరో రాజకీయ సమీకరణానికి తెరలేచింది.

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోబుధవారం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మరాజ వెంకటాద్రి స్వామి వారు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు.భక్తులు, శిష్యులు, స్థానికులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో అ–ర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది.

దాతల సహకారంతో నిర్మించిన పనుల వివరాలు:

– యాగశాల నిర్మాణానికి: రూ. 7 నుంచి 8 లక్షలు, – పశ్చిమ ద్వారం నిర్మాణానికి: దాదాపు రూ. 3 లక్షలు, – వికలాంగులు గుడిలోకి వెళ్ళుటకు ఏర్పాటుచేసిన ప్రత్యేక ద్వారం: రూ. 5 లక్షలు. దాతల సహకారంతో ఈ అభివృద్ధి పనులను చేపట్టడంజరిగిందని మఠం మేనేజర్ పల్లకొండ పెంచల నరసింహ ప్రసాద్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

❍త్వరలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విగ్రహం, ఆర్చ్ ఏర్పాటు: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. ఆయన సేవలు, ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 139వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆధునిక భారత విద్యావ్యవస్థ అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్ర, దేశానికి చేసిన సేవలు, ఆదర్శాలను భావితరాల విద్యార్థులకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆజాద్ ఆశయాలను యువతలోకి తీసుకెళ్లేందుకు విద్యార్థులకు వ్యాసరచన, సంగీత పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ మైనారిటీ నాయకులు, కార్యకర్తల విజ్ఞప్తి మేరకు స్థానిక షాదీఖానా వద్ద మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆయన పేరుతో ఆర్చ్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ పనులన్నింటినీ ఏడాదిలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి తోడ్పడే ఆదర్శవంతమైన వ్యక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్డీయే కూటమి కార్పొరేటర్లు, నూతన ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ అభ్యర్థులు, మైనారిటీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు జిల్లా పోలీసుల ఘన నివాళి

❍జాతీయ సమైక్యత, మత సామరస్యానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం: అదనపు ఎస్పీ రమణమూర్తి



గుంటూరు, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జి.వి. రమణమూర్తి ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

హిందూ–ముస్లిం ఐక్యత, జాతీయ సమైక్యత, మత సామరస్య పరిరక్షణకు ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతనిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎం.టి.ఆర్.ఐ శ్రీహరి రెడ్డి, ఆర్ఎస్ఐలు రతన్ రాజు, ఏవో సులోచన, సెక్షన్ అధికారులు అంజిబాబు, రమాదేవి, సుభాషిణి, అరుణకుమారి, పోలీసు, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

❍నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దు..

❍అధికారులకు కలెక్టర్ సాయికాంత్ వర్మ ఆదేశం



గుంటూరు, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): మార్పు పథకం కింద ప్రభుత్వ వసతి గృహాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ని.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

బుధవారం తాడికొండలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల వసతి గృహం, ఎస్వీపీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన వివిధ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. పనులను మరింత వేగవంతం చేయాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.

విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ దిశగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి మయూరి, తహసీల్దార్ సీతారామయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.
55

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) : స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను తెనాలిలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ సుభాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, షేక్ నాసర్, సిల్వర్ జిలానీ, మగ్బుల్, సిగ్బతుల్లా ఖాన్, ఇర్ఫాన్, అహ్మద్ అలీ, హబీబ్, మస్తాన్, షావుల్, ఫణిదపు దుర్గ, కొల్లపూడి రాజు, పఠాన్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం జీవితం ఆదర్శం



❍తూర్పు కార్యాలయంలో ఘన నివాళులర్పించిన మైనారిటీ నాయకులు

గుంటూరు, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): స్వాతంత్ర్య సమరయోధుడు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ మైనారిటీ నాయకులు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్వతంత్ర భారతదేశంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశంలో ఐఐటీ, యూజీసీ వంటి అత్యున్నత విద్యాసంస్థల స్థాపనకు ఆనాడే పునాదులు వేసిన గొప్ప దూరదృష్టి కలిగిన నాయకుడు ఆజాద్ అని గుర్తు చేశారు. 14 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను అందించడంతో పాటు, స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి ఆజాద్ ఎంతో కృషి చేశారని చెప్పారు. 'అల్–హిలాల్' పత్రిక ద్వారా స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిస్తూనే, లౌకికత్వానికి, మత సామరస్యానికి ఆయన ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ అధ్వర్యంలో నియోజకవర్గంలో మైనారిటీల సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కట్టుబడి పని చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ విభాగం నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బహిరంగ వేలం ద్వారా లక్ష 63 వేల ఆదాయం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం ప్రాంగణంలో బుధవారం బియ్యం గంటలు ట్రాక్టర్ లను బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది.బియ్యము ఒక కేజీ 33/– చొప్పున 1000 కేజీ లకి గాను 33000/–
గంటలు 1kg 640/– చొప్పున 100కేజీ లకు గాను 64000/–
ట్రాక్టర్ ని 66000/– వేలంపాటలో దక్కించుకున్నారు ఈ బహిరంగ వేలం పాటల ద్వారా దేవస్థానానికి మొత్తంగా 1,63,000/–ఆదాయం వచ్చింది. ఈ వేలం పాటల నిర్వహణలో మైదుకూరు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ అధికారిని శ్రీఫణి సుజయశీల మేనేజరు పి పి ఎన్ ప్రసాద్ వేలంపాట ద్వారా భక్తులు పుర(ప్రజలు మఠం సిబ్బంది పాల్గొనడం జరిగింది.

ప్రభుత్వ వాహనాలుగా ఎలక్ట్రిక్ కార్లే మొదటి ప్రాధాన్యత.. కేంద్రం కీలక నిర్ణయం

అమరావతి, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో అధికారుల ఉపయోగం కోసం సమకూర్చే స్టాఫ్ కార్లలో ఇకపై ఎలక్ట్రిక్ వాహనాలకే (ఈవీ) తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రాథమిక, ప్రాధాన్య ఎంపికగా (డిఫాల్ట్ అండ్ ప్రిఫర్డ్ ఛాయిస్) నిర్ణయిస్తూ ఆర్థిక శాఖ పరిధిలోని వ్యయ విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్) అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వ తాజా ఆదేశాల ప్రకారం.. మంత్రిత్వ శాఖలు, విభాగాలు కొనుగోలు చేసే ఎలక్ట్రిక్ కార్ల గరిష్ఠ డీలర్ ధర (నెట్ డీలర్ ప్రైస్) పరిమితిని రూ. 20 లక్షలకు పెంచారు. గతంలో ఉన్న పరిమితితో పోలిస్తే ఇది రెట్టింపు కావడం గమనార్హం. అదే సమయంలో పెట్రోల్, డీజిల్, హైబ్రిడ్ వంటి సాంప్రదాయ అంతర్గత దహన ఇంజిన్ (ఐసీఈ) వాహనాల గరిష్ఠ కొనుగోలు ధర పరిమితిని రూ. 10 లక్షలుగా ఖరారు చేశారు. దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీని వేగవంతం చేయడం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, మార్కెట్ పరిస్థితులు మరియు వాహనాల దీర్ఘకాలిక నిర్వహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇకపై వివిధ శాఖల్లోని పాత ఐసీఈ కార్లను తొలగించినప్పుడు (కండెమ్నేషన్) లేదా వాటి స్థానంలో కొత్త వాహనాలను సమకూర్చుకోవాల్సి వచ్చినప్పుడు సాధారణంగా ఎలక్ట్రిక్ కార్లనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కేవలం కొత్త వాహనాల కొనుగోలుకే కాకుండా, కార్యాలయ అవసరాల కోసం కార్లను అద్దెకు తీసుకునే సందర్భాల్లో కూడా ఈవీలకే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2022 సెప్టెంబర్ 1న జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అద్దె వాహనాల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం లేదా కొనుగోలు ఆచరణాత్మకం కాదని భావిస్తే మాత్రం ఐసీఈ వాహనాల కొనుగోలుకు మినహాయింపు కోరే అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు, బలమైన కారణాలతో కూడిన ప్రతిపాదనను వ్యయ విభాగానికి పంపాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనకు సంబంధిత మంత్రిత్వ శాఖ లేదా విభాగం కార్యదర్శి ఆమోదం, ఫైనాన్షియల్ అడ్వైజర్ ఏకీభావం తప్పనిసరి. ఆయా ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వ్యయ విభాగం మినహాయింపులపై నిర్ణయం తీసుకుంటుంది. వాహనాల కొనుగోలు ప్రక్రియ మొత్తం జనరల్ ఫైనాన్షియల్ రూల్స్ (జీఎఫ్ఆర్) 2017 నిబంధనలకు లోబడి కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.

దేశ విద్యా వ్యవస్థ అభివృద్ధికి మౌలానా ఆజాద్ కృషి ఎనలేనిది



గుంటూరు, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ జాతీయ నాయకుడు, విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ గొప్ప భారత స్వాతంత్ర్య సమరయోధులు అన్నారు. భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి, దేశ విద్యా వ్యవస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు.

ఆజాద్ అరబిక్, పర్షియన్, ఉర్దూ భాషలతో పాటు ఇస్లామిక్ ధర్మశాస్త్రం, తత్వశాస్త్రం, గణితం వంటి అనేక అంశాలను అభ్యసించారని చెప్పారు.

స్వయంకృషితో ఇంగ్లీషు భాషతో పాటు ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని కూడా అధ్యయనం చేశారని తెలిపారు. దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఆజాద్ తన రచనలు, ప్రసంగాలను ఉపయోగించారని చెప్పారు. 1912లో 'అల్ హిలాల్' అనే ఉర్దూ పత్రికను ప్రారంభించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించిన వ్యక్తి అన్నారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలని, మతాలకు అ–తీతంగా భారతీయులందరూ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారని తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని ఆయన ఆకాంక్షించారని అన్నారు. పేదలు, మహిళలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విద్య అందించాలని కృషి చేశారని పేర్కొన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని ఆకాక్షించారని అన్నారు. సాంకేతిక, శాస్త్రీయ విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.

విశ్వవిద్యాలయాల ప్రమాణాలు పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటుకు పునాది వేశారన్నారు. భారతీయ సాంస్కృతిక, సాహిత్య, కళారంగాల అభివృద్ధికి సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీల ఏర్పాటుకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. విద్యను కేవలం ఉద్యోగ సాధనంగా కాకుండా సమాజ అభివృద్ధికి, జాతీయ పురోగతికి ప్రధాన సాధనంగా భావించారని తెలిపారు. ఇండియా విన్స్ ఫ్రీడమ్ వంటి రచనలు చేశారని తెలిపారు. దేశానికి, ముఖ్యంగా విద్యారంగానికి ఆయన చేసిన అమూల్యమైన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 1992లో మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నతో గౌరవించిందన్నారు. 2008 నుంచి కేంద్రప్రభుత్వం ఆజాద్ జన్మదినం రోజును జాతీయ విద్యా దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం దేశభక్తికి, విద్యపట్ల అంకితభావానికి, మతసామరస్యానికి, జాతీయ సమైక్యతకు ఒక గొప్ప నిదర్శనం అన్నారు. విద్య ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని విశ్వసించిన ఆయన ఆశయాలు నేటికీ భారతీయ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ఘనవిజయం సాధించిన ముక్కా శ్రావణిని అభినందించిన మంత్రి లోకేష్



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల జరిగిన విశాఖపట్నం కార్పోరేషన్ ఎన్నికల్లో కూటమి తరపున టీడీపీ మేయర్ అభ్యర్థిగా పోటీచేసి అఖండ విజయం సాధించిన ముక్కా శ్రావణిని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ మేరకు సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు విశాఖ చేరుకున్న మంత్రి నారా లోకేష్ ను బుధవారం సాయంత్రం ముక్కా శ్రావణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ముక్కా శ్రావణిని ఈ సందర్భంగా లోకేష్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ టీడీపీ కంచుకోట అని మరోసారి నిరూపించారన్నారు. త్వరలో జరగబోయే 23 మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషిచేసేలా ఇటీవల గెలిచిన అభ్యర్థులకు బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఎన్జీజీఓ వినతి



గుంటూరు నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థలో జీఎస్‌డబ్ల్యూఎస్ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రబాబును ఏపీఎన్జీజీఓస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గంటసాల శ్రీనివాస్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది.
ముఖ్యంగా సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) అమలుకు సంబంధించిన అంశంపై ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించి, పెండింగ్‌లో ఉన్న ఫైల్‌ను త్వరితగతిన పరిష్కరించాలని కోరింది. ఉద్యోగుల ఇతర సమస్యలను కూడా అదనపు కమిషనర్‌తో చర్చించింది.
ప్రతినిధుల విజ్ఞప్తిపై స్పందించిన రవీంద్రబాబు ఏఏఎస్‌కు సంబంధించిన ఫైల్‌ను ప్రాసెస్ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏపీ ఎన్జీజీఓస్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్, డీఈసీ సభ్యుడు బెన్‌హర్, చాణక్య, నాగేశ్వరరావు, కామేష్‌తో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లకు ఓపీఎస్ సాధనకు కృషి

❍ప్రభుత్వానికి అధికారికంగా వినతిపత్రం సమర్పిస్తాం
❍ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్



విజయవాడ, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఏపీ హంస (ఏపీఎంహెచ్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల పెన్షన్ భద్రత, భవిష్యత్తు ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యతనిస్తూ వారి న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లకు ఓపీఎస్ అమలు అంశంపై విజయవాడలోని ఎం.జి. రోడ్డులో ఉద్యోగులు సమావేశమయ్యారు. తమ పెన్షన్ సమస్యను పరిష్కరించుకునేందుకు గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘం ద్వారా ప్రభుత్వానికి అధికారికంగా వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు.
ఈ క్రమంలో ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్‌ను కలిసి, రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లను ఓపీఎస్ పరిధిలోకి తీసుకొచ్చేలా సంఘం తరపున చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యోగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘం ద్వారా తగిన రీతిలో అధికారిక ప్రతిపాదన సమర్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
పెన్షన్ అనేది ఉద్యోగుల భవిష్యత్తు ఆర్థిక భద్రతకు సంబంధించిన కీలక అంశమని, రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్ల ఓపీఎస్ డిమాండ్ పరిష్కారానికి సంఘం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.
తమ సమస్యపై సానుకూలంగా స్పందించి ఓపీఎస్ సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చిన ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్‌కు రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠకు విజ్ఞప్తి చేశారు.
ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో గురువారం ఆయన కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.
ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రెమ్యూనరేషన్‌ను పెంచాలని, మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో ఉన్న వ్యత్యాసాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. ఏకగ్రీవమైన ప్రాంతాల్లో ఎన్నికల శిక్షణకు హాజరైన ఉద్యోగులకు కూడా రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు. ఎన్నికల విధుల సమయంలో ప్రమాదవశాత్తు మరణించే ఉద్యోగుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, దివ్యాంగ ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి పూర్తిగా మినహాయింపు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.
ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఉద్యోగుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

స్వచ్ఛతలో సత్తా చాటిన గుంటూరు.. జాతీయ స్థాయిలో మూడో స్థానం

❍'సూపర్ స్వచ్ఛ లీగ్'లో ప్రతిష్ఠాత్మక పురస్కారం..
❍రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న నగర కమిషనర్



గుంటూరు, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): జాతీయ స్థాయిలో గుంటూరు నగరం మరో అరుదైన గుర్తింపును సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో భాగంగా 3 నుంచి 10 లక్షల జనాభా కలిగిన నగరాల విభాగంలో 'సూపర్ స్వచ్ఛ లీగ్' స్వచ్ఛ నగరాల కేటగిరీలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఘనతతో గుంటూరు నగర పాలక సంస్థ జాతీయ పురస్కారాన్ని అందుకుంది.
న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ పురస్కారాన్ని స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం ఆరు జాతీయ అవార్డులను సాధించి దేశంలో రెండో స్థానంలో నిలవడం విశేషం.
నగరంలో పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, వ్యర్థాలను సంపదగా మార్చడం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి చర్యలు గుంటూరుకు ఈ గుర్తింపును తీసుకొచ్చాయి. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తుండగా, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో బయో-సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు కూడా చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి లెటర్ ఆఫ్ అవార్డు జారీ చేసింది.
అదేవిధంగా పారిశుధ్య నిర్వహణలో వేగం, నాణ్యత పెంచేందుకు ఎలక్ట్రిక్ ఆటోలు, కాంపాక్టర్లు, ఆధునిక స్వీపింగ్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. నగరంలోని పాత చెత్త నిల్వలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చేందుకు 30 రోజుల పాటు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రతి నెల మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ద్వారా ప్రజలను పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తోంది.
ఈ సందర్భంగా నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ మాట్లాడుతూ, గుంటూరుకు లభించిన జాతీయ పురస్కారం పారిశుధ్య కార్మికుల అంకితభావానికి, అధికారుల సమష్టి కృషికి, ప్రజల సహకారానికి లభించిన గుర్తింపని అన్నారు. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని గుంటూరును మరింత పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. 'నవ గుంటూరు' నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగులకు నవంబర్ 14న రెండో శనివారం సెలవు యథాతథం

❍అక్టోబర్ 19న విధులకు హాజరైన ఉద్యోగులకు వర్తింపు..
❍ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయవాడ, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): అక్టోబర్ 19న విధులకు హాజరైన ప్రభుత్వ ఉద్యోగులు నవంబర్ 14 రెండో శనివారం సెలవును యథాతథంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్-బి) నవంబర్ 11న మెమో నంబర్ 2970189/Poll.B/2025-5 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది.
అక్టోబర్ 20న దసరా పండుగ సందర్భంగా ముందురోజైన అక్టోబర్ 19 సోమవారాన్ని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. దీనికి బదులుగా నవంబర్ 14 రెండో శనివారాన్ని పని దినంగా నిర్ణయించింది. అయితే అక్టోబర్ 19న ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్ కార్యక్రమం, దసరా ఉత్సవాలు, సరస్ కార్యక్రమం తదితర విధుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.
ఈ నేపథ్యంలో అక్టోబర్ 19న విధులకు హాజరైన ఉద్యోగులకు నవంబర్ 14న కూడా పని దినంగా నిర్ణయిస్తే ఒక సెలవు దినాన్ని కోల్పోతారని ఏపీ జేఏసీ అమరావతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అక్టోబర్ 21న ప్రభుత్వ ఉన్నతాధికారులకు లేఖ సమర్పించి, గ్రామ సచివాలయ ఉద్యోగుల నుంచి జిల్లా స్థాయి వరకు విధులు నిర్వహించిన ఉద్యోగులందరికీ నవంబర్ 14 రెండో శనివారం సెలవును యథాతథంగా కొనసాగించాలని కోరింది.
ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. అక్టోబర్ 19న ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్, దసరా ఉత్సవాలు, సరస్ కార్యక్రమాల విధుల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాల నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యోగులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారని తెలిపారు. ఆ రోజు విధులకు హాజరైన ఉద్యోగులకు నవంబర్ 14న కూడా పని దినంగా నిర్ణయిస్తే ఒక సెలవు దినాన్ని కోల్పోతారని భావించి, రెండో శనివారం సెలవును యథాతథంగా కొనసాగించాలని అక్టోబర్ 21నే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, విధుల్లో పాల్గొన్న ఉద్యోగులందరికీ నవంబర్ 14న సెలవు వినియోగించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల న్యాయమైన అభ్యర్థనను మన్నించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
అక్టోబర్ 19న ఎన్నికలు, దసరా, సరస్ తదితర విధుల్లో పాల్గొన్న ఉద్యోగులందరూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నవంబర్ 14 రెండో శనివారం సెలవును యథావిధిగా వినియోగించుకోవాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాద బాధితురాలిని ఆసుపత్రికి తరలించిన మంత్రి దుర్గేష్



❍విజ్జేశ్వరం వద్ద లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు..
❍తన వాహనంలోనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

నిడదవోలు, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో బాధపడుతున్న మహిళను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా తన వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. నిడదవోలు పర్యటనకు వెళ్తున్న సమయంలో విజ్జేశ్వరం సమీపంలో జరిగిన ఈ ఘటనను గమనించిన మంత్రి వెంటనే స్పందించి బాధితురాలికి వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు.
బుధవారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి నిడదవోలుకు వెళ్తున్న మంత్రి దుర్గేష్‌కు విజ్జేశ్వరం సమీపంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మహిళను లారీ ఢీకొట్టినట్లు తెలిసింది.
ఈ ప్రమాదంలో తణుకుకు చెందిన మహిళ కాలు విరిగి తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయి రక్తస్రావంతో బాధపడుతోంది. ఈ దృశ్యాన్ని గమనించిన మంత్రి వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి, వాహనం దిగి ప్రమాద స్థలానికి చేరుకున్నారు.
క్షతగాత్రురాలికి ధైర్యం చెప్పి, స్థానికుల సహాయంతో ఆమెను తన కాన్వాయ్ వాహనంలోకి ఎక్కించారు. వెంటనే నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రాథమిక చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.
మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేసి, చికిత్సకు సంబంధించిన వివరాలను స్వయంగా పర్యవేక్షించారు. మంత్రి సకాలంలో స్పందించి బాధితురాలికి వైద్య సహాయం అందించడంతో ఆమె కుటుంబ సభ్యులు ఊరట చెందారు.
ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, రహదారులపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారుల నిర్లక్ష్యం ఇతర కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపకూడదని అన్నారు.
ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.
ప్రమాద సమయంలో మంత్రి వెంటనే స్పందించి బాధితురాలిని ఆసుపత్రికి తరలించడంపై స్థానికులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు డిసెంబర్ 1 నుంచి ఢిల్లీ ముట్టడి

❍నాలుగు లేబర్ కోడ్ల రద్దు, కనీస వేతనం రూ.42 వేలు, పెన్షన్ రూ.21 వేలు ప్రధాన డిమాండ్లు
❍ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాదిగా కార్మికులు తరలిరావాలి
❍సీఐటీయూ పిలుపు

విజయవాడ, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం డిసెంబర్ 1 నుంచి ఢిల్లీలో భారీ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు రాష్ట్రం నుంచి వేలాదిగా కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చింది.
ఢిల్లీ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను బుధవారం విజయవాడలోని సీఐటీయూ రాష్ట్ర కమిటీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు తదితర నాయకులు ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాన్ని నెలకు రూ.42 వేలకు పెంచాలని, పెన్షన్‌ను రూ.21 వేలకు నిర్ణయించాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం, సామాజిక భద్రత కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల జల్, జమీన్, జంగిల్ హక్కులను కాపాడాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కోరారు.
కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం భారీగా పన్ను రాయితీలు, రుణమాఫీలు కల్పిస్తూ, కొత్తగా నియమించే ఉద్యోగుల పీఎఫ్ వాటాలో కొంత భాగాన్ని కూడా భరిస్తోందని నాయకులు విమర్శించారు. మరోవైపు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేసే స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించేందుకు నిధులు లేవని చెప్పడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు బడ్జెట్ లేదని చెప్పడం కార్మికులను నిర్లక్ష్యం చేయడమేనని పేర్కొన్నారు.
నాలుగు లేబర్ కోడ్ల అమలుతో కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని, జాతీయ కనీస వేతనం పేరుతో రోజుకు రూ.178 మాత్రమే నిర్ణయించడం దారుణమని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానానికి విఘాతం కలిగించే చర్యలు చేపడుతూ, ఉద్యోగ భద్రతను బలహీనపరుస్తున్నారని, సమ్మె హక్కుపై ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాల రక్షణ నుంచి కోట్లాది మంది కార్మికులను దూరం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు.
రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వీఓఏ, ఆర్పీ, సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, 108, 104, తల్లీబిడ్డ, అర్బన్ హెల్త్, ఆయుష్, ఎన్టీఆర్ వైద్యసేవ తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. మరో మూడు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టైమ్‌స్కేల్, కంటింజెంట్, డైలీవేజ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీల నేపథ్యంలో వీరందరికీ నెలకు కనీసం రూ.42 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ, ఆటో, భవన నిర్మాణ, గిగ్, స్వయం ఉపాధి, వలస కార్మికులకు కూడా నెలకు రూ.42 వేల ఆదాయ భద్రత కల్పించాలని, అందులో సగం మొత్తాన్ని పెన్షన్ రూపంలో అందించాలని కోరారు.
ఈపీఎస్, సీపీఎస్, ఎన్‌పీఎస్‌తో పాటు సామాజిక పెన్షనర్లకు కూడా తగిన పెన్షన్ కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు కె. సుబ్బరావమ్మ, ఆర్.వి. నర్సింహారావు, ముజఫర్ అహమ్మద్, కె.ఆర్.కె. మూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. శ్రీనివాసరావు, పి. దుర్గ, వీణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల సమగ్ర వైద్య సేవలపై రాష్ట్రస్థాయి సెమినార్

❍గుండెపోటు, పక్షవాతం బాధితులకు
❍సత్వర చికిత్సే లక్ష్యం వ్యాధుల ముందస్తు గుర్తింపు, నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యం



అమరావతి, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్): గుండెపోటు, పక్షవాతం బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులను సమర్థంగా నియంత్రించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రస్థాయి సెమినార్‌ను నిర్వహించింది. మంగళగిరిలోని ఓ హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాధుల ముందస్తు గుర్తింపు, సత్వర నిర్ధారణ, సమగ్ర చికిత్స, నిరంతర వైద్య పర్యవేక్షణపై అధికారులు, వైద్యులకు అవగాహన కల్పించారు.
జాతీయ అసంక్రమిత వ్యాధుల నివారణ, నియంత్రణ కార్యక్రమం (ఎన్‌పీ-ఎన్‌సీడీ), ఆర్‌బీఎస్‌కే 2.0, ఆర్‌కేఎస్‌కే కార్యక్రమాల అమలును మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు నేతృత్వంలో, వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ ఎ. విష్ణువర్ధన్, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ ఆర్. వెంకటరమణ సమన్వయంతో ఈ సెమినార్ నిర్వహించారు. జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర అసంక్రమిత వ్యాధుల విభాగం అధికారి కె. శ్యామల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.

రక్తపోటు, మధుమేహ నియంత్రణపై ప్రత్యేక దృష్టి
సెమినార్ తొలి రోజు రాష్ట్రంలో అమలవుతున్న అసంక్రమిత వ్యాధుల వైద్య సేవలను మరింత సమర్థంగా కొనసాగించే అంశాలపై శిక్షణ ఇచ్చారు. రక్తపోటు, మధుమేహం నియంత్రణ, వాటి వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల నివారణ, మానసిక ఆరోగ్యం, పొగాకు నియంత్రణ, నోటి ఆరోగ్యం, అయోడిన్ లోపం, ఫ్లోరోసిస్, వినికిడి లోపాల నివారణ కార్యక్రమాల సమన్వయ అమలుపై చర్చించారు.
అవసరమైన మందులు, వైద్య పరీక్షల పరికరాల లభ్యత, వైద్య సేవల సంసిద్ధత, సరఫరా వ్యవస్థ, పర్యవేక్షణ, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాలపై సూచనలు చేశారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థలను సమర్థంగా వినియోగించడంపైనా దృష్టి సారించారు.

గుండెపోటు, పక్షవాతం చికిత్సా సేవల బలోపేతం
రెండో రోజు గుండెపోటు, పక్షవాతం బాధితులకు సమగ్ర వైద్య సేవలు అందించే విధానాలపై ప్రత్యేకంగా చర్చించారు. స్టెమీ (ఋజువీ×) గుండెపోటు చికిత్సా కార్యక్రమం, పక్షవాతం చికిత్సా సేవల బలోపేతం, ద్వితీయ స్థాయి ఆసుపత్రుల్లో అసంక్రమిత వ్యాధుల వైద్య సేవల మెరుగుదలపై శిక్షణ ఇచ్చారు.
దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధుల గుర్తింపు, చికిత్స, కొవ్వు కాలేయ వ్యాధి, సమగ్ర క్యాన్సర్ వైద్యం, నివారణాత్మక క్యాన్సర్ వైద్య విభాగాల ఏర్పాటు, ఉపశమన వైద్య సేవలపైనా వివరించారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్య సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచి రోగులకు అన్ని దశల్లో నిరంతర వైద్య సేవలు అందించాల్సిన అవసరాన్ని నిపుణులు వివరించారు.

క్షేత్రస్థాయి సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు
ఎయిమ్స్ న్యూఢిల్లీకి చెందిన డాక్టర్ వై.ఎస్. కుసుమ, ఈక్విప్ బృందం అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, క్షేత్రస్థాయి వైద్య సేవలపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఏఎస్ఆర్, స్టార్-ఎన్‌సీడీ పర్యవేక్షణ విధానాలు, వైద్య సేవల నాణ్యతను మెరుగుపరిచే మార్గాలపై చర్చించారు. కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను కనుగొనడంపై దృష్టి పెట్టారు.
నూరా హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో కేర్ కంపానియన్ కార్యక్రమం ద్వారా రోగులు, వారి కుటుంబ సభ్యులు, సంరక్షకులకు వైద్య సేవలపై అవగాహన కల్పించే విధానాలను వివరించారు. మందులను క్రమం తప్పకుండా వినియోగించడం, ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వైద్య సూచనలు పాటించడం, వ్యాధి నియంత్రణలో కుటుంబ సభ్యుల భాగస్వామ్యం వంటి అంశాల ప్రాధాన్యాన్ని తెలియజేశారు.

డిజిటల్ వ్యవస్థలతో నిరంతర పర్యవేక్షణ
అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాల్లో డిజిటల్ వ్యవస్థల వినియోగం ద్వారా సమాచార నమోదు, పర్యవేక్షణ, నివేదికల తయారీ, పనితీరు సమీక్షలను మరింత సమర్థంగా నిర్వహించే అంశాలపై శిక్షణ ఇచ్చారు. డ్యాష్‌బోర్డుల ద్వారా కార్యక్రమాల పురోగతిని పరిశీలించడం, లోపాలను గుర్తించడం, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై సూచనలు చేశారు.
వ్యాధుల పరీక్షలకే పరిమితం కాకుండా ముందస్తు గుర్తింపు, సకాలంలో నిర్ధారణ, చికిత్స, అవసరమైన సందర్భాల్లో ఉన్నత వైద్య సంస్థలకు రోగులను పంపించడం, తదుపరి వైద్య పర్యవేక్షణ వరకు సమగ్ర సేవలు అందించాల్సిన అవసరాన్ని సెమినార్‌లో స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఏ.ఎల్. పద్మావతి, వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ ఎ. విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ జె. విజయలక్ష్మి, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ రాష్ట్ర నోడల్ అధికారి బి.వి. రావు, ఆరోగ్య, ఆరోగ్యవర్ధక కేంద్రాల రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ జె. నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.
వైద్య విద్య సంచాలకుల కార్యాలయం క్యాన్సర్ విభాగం నోడల్ అధికారి డాక్టర్ రమేష్, అసంక్రమిత వ్యాధుల కార్యక్రమ అధికారి డాక్టర్ ప్రసన్న కుమార్, ఆర్‌బీఎస్‌కే, ఆర్‌కేఎస్‌కే కార్యక్రమాల అధికారి డాక్టర్ వి.వి.బి. సుబ్రహ్మణ్యం, ప్రపంచ ఆరోగ్య సంస్థ గుండె ఆరోగ్య అధికారులు డాక్టర్ సి.ఆర్. పటేల్, డాక్టర్ యు. సురేష్, రాష్ట్ర అసంక్రమిత వ్యాధుల ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీరతో పాటు వివిధ జిల్లాల కార్యక్రమ అధికారులు, ఎపిడెమియాలజిస్టులు, వైద్యాధికారులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com